RNI APTEL/25/A0798


# టుడే విదుర

జాతీయ తెలుగు దిన పత్రిక

https://www.todayvidhura.com/

ప్రచురణ: ఆంధ్రప్రదేశ్, తెలంగాణ సంపుటి : 1 సంచిక:50 10-8-2025 ఆదివారం ఎడిటర్ :మర్రి పవీన్ పేజీలు : 8 వెల 4 /-

## మళ్లీ జన్మంటూ ఉంటే ఇక్కడే పుడతా: చంద్రబాబు



ఆగస్టు 9(టుడే విదుర): ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్న మాటలు ు గిరిజనుల అభివృద్ధే రాష్ట్ర సమగ్ర వికాసానికి అడ్డుకట్ట లగిశపల్లి ప్రజలకు మాత్రమే కాక, మొత్తమైన గిరిజన సమాజానికి భరోసానిచ్చేలా నిలిచాయి. అల్లూరి సీతారామరాజు జిల్లా లగిశపల్లిలో అంతర్జాతీయ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా చంద్రబాబు పర్యటించారు. ఈ సందర్భంగా పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. పెద్ద ఎత్తున బడ్జెట్‌తో అభివృద్ధి పథకాలు ప్రారంభించారు. ఏజెన్సీ ప్రాంతాల్లోని 1,483 గిరిజన గూడెలకు రోడ్డు సదుపాయాల కోసం రూ. 2,850 కోట్లు కేటాయించినట్లు సీఎం ప్రకటించారు. ప్రతి ఇంటికి తాగునీరు అందించేందుకు జల జీవన్ మిషన్ కింద రూ. 220 కోట్లు వెచ్చిస్తున్నారు.

ఆరోగ్య పరిరక్షణకు కొత్త ఆసుపత్రులు

వైద్య సేవలను మెరుగుపర్చే లక్ష్యంతో ఐదు మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రుల నిర్మాణానికి రూ. 482 కోట్లు వెచ్చిస్తున్నారు. పాడేరు, రంపచోడవరం, శ్రీశైలం ఐటీడీఏ పరిధుల్లోనూ ఆసుపత్రులు ఏర్పాటు చేయనున్నారు. గిరిజన యువతకు ఉపాధి అవకాశాలు కల్పించే ఉద్దేశంతో జీవో నెంబర్ 3ను పునరుద్ధరించేందుకు కట్టుబడి ఉన్నారు. గత వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యం వల్ల జీవో రద్దయిందని, ఇప్పుడు దాన్ని తిరిగి తెచ్చేందుకు చట్టపరంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

అరకు కాఫీకి అంతర్జాతీయ గుర్తింపు

గిరిజనుల ఆర్థిక స్వయం సమృద్ధికి అరకు కాఫీ, మిరియాలు, పసుపు లాంటి ఆర్గానిక్ ఉత్పత్తులకు అంతర్జాతీయ మార్కెట్‌లో గుర్తింపు తీసుకురావాలని సీఎం చెప్పారు. వెదురు ఉత్పత్తుల ద్వారా 5,000 గిరిజన మహిళలకు వార్షికంగా లక్ష రూపాయల ఆదాయం వచ్చేలా ప్రాజెక్టు రూపొందించారట.''మళ్లీ జన్మ ఉంటే ఈ ఏజెన్సీలోనే పుట్టాలని కోరుకుంటున్నాను" అని అన్నారు. ఏజెన్సీ ప్రాంతాలను పర్యాటక కేంద్రాలుగా అభివృద్ధి చేసి, యువతకు ఇక్కడే ఉపాధి కల్పించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఇది యువతకు ఊతమిచ్చే వేదికగా మారనుంది.

## పోలీసులకు రాఖీ కట్టిన మంత్రి అనిత



విశాఖ,ఆగస్టు 9(టుడే విదుర): రక్షాబంధన్ పండుగ సందర్భంగా విధి నిర్వహణలో ఉన్న పోలీసులకు హోం మంత్రి అనిత రాఖీ కట్టారు. విశాఖ ఎంవీపీ కాలనీ నుంచి ఉషోదయ జంక్షన్ వరకు మంత్రి అనిత ఆటోలో ప్రయాణించారు. ఆటోడ్రైవర్ గిరీష్ యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఆయనకు కూడా రాఖీ కట్టి శుభాకాంక్షలు తెలిపారు. అనారోగ్యంతో బాధపడుతున్న కానిస్టేబుల్ కొర్లయ్యను పరామర్శించి రాఖీ కట్టారు. ఆయనకు ధైర్యం చెప్పిన మంత్రి.. సహాయం అందిస్తామని భరోసానిచ్చారు.

## నాకు మంగళగిరి మహిళలే అక్కాచెల్లెళ్లు : మంత్రి లోకేష్




మంగళగిరి ఆగస్టు 9(టుడే విదుర): సోదరి లేని తనకు మంగళగిరి మహిళలే అక్కాచెల్లెళ్లు అని మంత్రి లోకేష్ అన్నారు. శనివారం రాఖీ పండుగను పురస్కరించుకొని ఉండవల్లిలోని మంత్రి నివాసంలో మంత్రి లోకేష్‌కు మంగళగిరి మహిళలు పెద్ద ఎత్తున వచ్చి రాఖీలు కట్టారు. ఈ సందర్భంగా లోకేష్ మాట్లాడుతూ %ి% రాఖీకట్టి తనకు అందించిన ఆశీస్సులు కొండంత బలాన్నిచ్చాయన్నారు. '' మంగళగిరి ఆడబిడ్డలందరికీ నేను ఎల్లప్పుడూ రుణపడి ఉంటాను. మంగళగిరిలో త్వరలోనే మరో విడత ఇళ్ల పట్టాలు అందించేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నియోజకవర్గంలో 200 అభివృద్ధి కార్యక్రమాలు ప్రారంభించాం. అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, విద్యుత్, గ్యాస్ పైప్‌లైన్ల ఏర్పాటు, 100 పడకల ఆసుపత్రి, స్వర్ణకారుల కోసం జెమ్స్ అండ్ జ్యువెలరీ పార్కు వంటివి పురోగతిలో ఉన్నాయి. నియోజకవర్గ వ్యాప్తంగా రోడ్లన్నీ అభివృద్ధి చేస్తున్నాం. మహా ప్రస్థానం పేరుతో శ్మశాన వాటికల నిర్మాణం, పార్కుల అభివృద్ధికి చర్యలు చేపట్టాం. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగోలేకపోయినా మంగళగిరి నియోజకవర్గంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నాం " అని అన్నారు.

## రాఖీ పండుగ అంటే దారం కాదు: పవన్



ఆగస్టు 9(టుడే విదుర): రాఖీ పౌర్ణమి పండుగ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అందరికీ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ పండుగ మన సాంప్రదాయాల ఆనందానికి అద్దం పడుతుందని అన్నారు. రాఖీ అంటే కేవలం ఒక దారం కాదు అని పవన్ చెప్పారు. అది అక్కచెల్లెళ్ళు-అన్నదమ్ముల మధ్య ప్రేమకు గుర్తు అన్నారు. భావోద్వేగాలను పంచుకునే బంధానికి రాఖీ చిహ్నం అన్నారు. మహిళల జీవితాల్లో మార్పు తీసుకురావడమే తమ లక్ష్యం అన్నారు. మహిళల భద్రత, అభివృద్ధి పైనే తమ దృష్టి ఉందన్నారు. ప్రతి నిర్ణయంలో వారి మేలు దృష్టిలో పెట్టుకుంటామన్నారు. ప్రస్తుతం అమలు చేస్తున్న 'తల్లికి వందనం' పథకం విజయవంతమైంది అన్నారు. అలాగే 'దీపం-2' పథకం మహిళల జీవితాల్లో వెలుగులు నింపిందని చెప్పారు. ఈ పథకాలు మహిళలకి ఎంతో మేలు చేస్తున్నాయని తెలిపారు.

ఆగస్ట్ 15 నుంచి ఉచిత బస్సు ప్రయాణం

ఆగస్ట్ 15 నుండి ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం ప్రారంభమవుతుందన్నారు. ఇది మహిళలకు ఆర్థిక ఊరటనిస్తుందని వివరించారు. గ్రామీణ ప్రాంతాల మహిళలకు ఇది ఉపయోగకరమని చెప్పారు. తాను ఎప్పుడూ మహిళల పట్ల గౌరవంతో ప్రవర్తిస్తానని పవన్ స్పష్టం చేశారు. "ఆడపడుచులకు నేనెప్పుడూ అండగా ఉంటాను" అన్నారు. తమ ప్రభుత్వం కూడా అదే దిశగా పనిచేస్తుందన్నారు.

మహిళల భద్రత కోసం కట్టుబడి ఉన్నాం

సురక్షిత సమాజం కోసం మహిళల భద్రత అత్యవసరం అన్నారు. ప్రభుత్వంగా తమ బాధ్యతను పూర్తిగా నెరవేరుస్తామని చెప్పారు. అన్ని రంగాల్లో మహిళల భాగస్వామ్యాన్ని పెంచాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. తాను వేసే ప్రతి అడుగులో ప్రజల ఆశయాలే ముందుంటాయని పవన్ చెప్పారు. మహిళల అభివృద్ధే సమాజ అభివృద్ధికి దారితీస్తుందని నమ్మకం వ్యక్తం చేశారు.

## తిరంగాయాత్రలు, మౌన ర్యాలీలతో స్వాతంత్ర్య వేడుకలు: పీవీఎన్ మాధవ్

విజయవాడ, ఆగస్టు 9(టుడే విదుర): రేపటి నుంచి ఏపీవ్యాప్తంగా తిరంగా ర్యాలీలు నిర్వహిస్తున్నట్లు బీజేపీ ఆంధ్రప్రదేశ్ అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ తెలిపారు. (శనివారం) మండల, జిల్లా, రాష్ట్ర స్థాయి బీజేపీ నేతలతో పీవీఎన్ మాధవ్ ఆడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాధవ్ మీడియాతో మాట్లాడారు. ఆగస్టు 14వ తేదీ నుంచి దేశ విభజన గాయాన్ని పురస్కరించుకుని మౌన ప్రదర్శనలు చేపడుతున్నట్లు వెల్లడించారు. రేపటి నుంచి మండల, జిల్లా స్థాయిలో తిరంగా ర్యాలీ నిర్వహించాలని సూచించారు పీవీఎన్ మాధవ్. ఆజాదికా అమృత మహోత్సవం నుంచి బీజేపీ పరంగా ప్రతి సంవత్సరం తిరంగాయాత్రలు నిర్వహిస్తున్నామని వ్యాఖ్యానించారు. రేపటి నుంచి 14వ తేదీ వరకు తిరంగాయాత్రలు చేపడుతున్నట్లు తెలిపారు. తిరంగాయాత్రలు నిర్వహిస్తూ స్థానికంగా స్వాతంత్ర్య సమర యోధుల విగ్రహాలను పరిశుభ్రం చేయాలని సూచించారు.

## సింహాచలం లక్ష్మీనరసింహస్వామి ఆభరణాల తనిఖీ..

విశాఖ,ఆగస్టు 9(టుడే విదుర): సింహాచలం వరాహ లక్ష్మీనరసింహస్వామి ఆభరణాలను ఫైవ్‌మాన్ కమిటీ సభ్యులు తనిఖీలు చేస్తున్నారు. గత ఏడాది కడప ప్రాంతానికి చెందిన ప్రభాకరాచారి అప్పన్న భక్తులు సమర్పించిన రజిత, స్వర్ణ ఆభరణాల తూనికల్లో తేడాలున్నాయని, కొన్ని ఆభరణాలు మాయమయ్యాయని, వాటి నిజాలు నిగ్గు తేల్చాలని దేవదాయశాఖ కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో అప్పటి దేవదాయశాఖ ప్రాంతీయ సంయుక్త కమిషనర్ కె.సుబ్బారావు విచారణకు ఆదేశించారు. ఈ మేరకు దేవదాయశాఖ జ్యువలరీ వెరిఫికేషన్ ఆఫీసర్ పల్లం రాజు ఈ ఏడాది జనవరి 17, 18 తేదీల్లో రికార్డులను పరిశీలించా రు. ఆలయం, పద్మనిధి, ట్రెజరీలో ఆభరణాలను తూనికలు వేసి రికార్డులను సిద్ధం చేశారు. కానీ ఆభరణ ప్రదర్శనశాలలోని వస్తువులు తనిఖీ చేయలేదు. ఈ నేపథ్యంలో ప్రక్రియను పూర్తిచేయాలని విజయనగరం మాన్సాస్, అరసవల్లి దేవస్థానం ఈఓ ప్రసాద్ చైర్మన్‌గా ఫైవ్‌మాన్ కమిటీని నియమించారు. ఈ మేరకు ఫైవ్‌మాన్ కమిటీ (శనివారం) ఆభరణాలు తనిఖీలు చేపట్టారు.

## పులివెందుల ఎన్నికలో వైసీపీ నేతలు అవకతవకలకు పాల్పడుతున్నారు: బీటెక్ రవి

కడప, ఆగస్టు 9(టుడే విదుర): పులివెందుల, ఒంటిమిట్ల జెడ్పీటీసీ ఉప ఎన్నికల్లో వైసీపీ నేతలు కుయుక్తులకు పాల్పడుతున్నారని తెలుగుదేశం పులివెందుల ఇన్‌చార్జ్ బీటెక్ రవి సంచలన ఆరోపణలు చేశారు. పులివెందులలో సాక్షి మీడియాను అడ్డుపెట్టుకొని వైసీపీ నేతలు కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు. ఏపీ నలుమూలల నుంచి పులివెందులకు సాక్షి రిపోర్టర్‌లు వచ్చారని చెప్పుకొచ్చారు. వాళ్లకు వాళ్లే దాడి చేసుకొని తమపై నింద వేయడానికి ప్లాన్ చేస్తున్నారని ధ్వజమెత్తారు. ఇవాళ(శనివారం) పులివెందులలో బీటెక్ రవి మీడియాతో మాట్లాడారు. స్వతంత్ర అభ్యర్థులుగా వైసీపీ వ్యక్తులే నామినేషన్ వేశారని ఆరోపించారు బీటెక్ రవి.

# సంపాదకీయం

## ట్రంప్ వృషభ వీరంగాలు

భారత్ ఒకప్పుడు విదేశీ వాణిజ్యానికి సుముఖంగా ఉండేది కాదు. ముఖ్యంగా దిగుమతులను వ్యతిరేకించేది. సహచర అలీనోద్యమ దేశాలతోనైనా, తోటి వర్ధమాన దేశాలతోనైనా అదే వైఖరితో వ్యవహరించేది. వాణిజ్యం, విదేశీ పెట్టుబడుల విషయంలో అన్య దేశాలతో వ్యవహరించడంలో అత్యంత అప్రమత్తంగా ఉండేది. వాణిజ్య భారతావని తలుపులు పూర్తిగా మూసివేశాం. నాలుగు దశాబ్దాల పాటు వాటిని తిరిగి తెరువనే లేదు. పైగా ఎగుమతి దిగుమతులకు భయంకరమైన నిబంధనలు నిర్దేశించాం. అవును, ప్రతి ఎగుమతికీ, ప్రతి దిగుమతికీ లైసెన్స్‌లు, పర్మిట్‌లు తప్పనిసరి. మన దిగుమతులలో అత్యధికం, ఎగుమతులలో కొన్ని ప్రభుత్వ యాజమాన్యంలోని కార్పొరేషన్ల ద్వారా విధిగా జరుగుతుండేవి. 'చీఫ్ కంట్రోలర్ ఆఫ్ ఇంపోర్ట్స్ అండ్ ఎక్స్‌పోర్ట్స్' అనే అధికారి ఒకరు మనకు ఉండేవారు. ఆయన కింద ఒక విస్తృత అధికార గణం ఉండేది. వారు దేశవ్యాప్తంగా ఉండేవారు. ఈ అధికార గణం చేసే ఏకైక పని దిగుమతులు, ఎగుమతులకు లైసెన్స్‌లు జారీ చేయడమే! అదొక లాభసాటి వ్యవహారం. ఎవరూ ఎప్పుడూ ఒక ప్రశ్న అడిగిన పాపానికి పోలేదు: 'మంచిదే, దిగుమతులను నియంత్రించే అధికారి ఒకరు ఉండడాన్ని అర్థం చేసుకుంటున్నాం, అయితే ఎగుమతులను నియంత్రించే అధికారి ఎందుకు ఉన్నారు?'. ప్రశ్న స్పష్టమే. సమాధానమే లేదు. ఈ విధానం ఎగుమతులను పెంపొందించలేదు. ఎగుమతుల ఆధారిత తయారీ పరిశ్రమల రంగాన్ని అభివృద్ధిపరచలేదు. విదేశీ మారకద్రవ్య నిల్వలను సమృద్ధం చేయలేదు. ఇదిలా ఉండగా భారత్‌తో సమస్థాయి ఆర్థిక వ్యవస్థలు ఉన్న దేశాలు ప్రపంచ ఆర్థిక వ్యవస్థతో అనుసంధానమయ్యే బహిరంగ ఆర్థిక వ్యవస్థ (ఓపెన్ ఎకానమీ)ను అభివృద్ధిపరచుకోవడానికి సంకల్పించాయి. స్వేచ్ఛా వాణిజ్యాన్ని అనుమతించి సుసంపన్నమయ్యాయి.అనేక కారణాల వల్ల భారత ఆర్థిక వ్యవస్థ 1990%–%91లో సంక్షోభం అంచుకు చేరింది. ఆర్థిక సంస్కరణలను అమలుపరచడం భారత ప్రభుత్వానికి అనివార్యమయింది. వాణిజ్య, పారిశ్రామిక విధానాలలో మౌలిక మార్పులతో ఆర్థిక క్రమశిక్షణకు అగ్ర ప్రాధాన్యమివ్వడం ద్వారా భారత్ ఆ సంక్షోభం నుంచి గట్టెక్కింది. అభివృద్ధిపథంలోకి ప్రవేశించి వడివడిగా ముందుకు సాగింది. సుంకాలు తగ్గించాం (సగటు సుంకాన్ని 2013లో 12 శాతానికి తీసుకువచ్చాం), సుంకాలేతర అవరోధాలను తొలగించాం. 'సుంకాలు, వాణిజ్య సాధారణ ఒప్పందం' (జనరల్ అగ్రిమెంట్ ఆన్ టారిఫ్స్ అండ్ ట్రేడ్)పై సంతకం చేసి ప్రపంచ వాణిజ్య సంస్థ (డబ్ల్యుటీఓ)లో సభ్య దేశంగా చేరాం. వివిధ దేశాలతో స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలు కుదుర్చుకున్నాం. ఆర్థిక వ్యవస్థ అనేది ఎటువంటి ప్రతిబంధకాలు లేకుండా ప్రపంచ ఆర్థిక వ్యవస్థతో అనుసంధానమై ఉండే బహిరంగ ఆర్థిక వ్యవస్థగా ఉండాలనే యథార్థాన్ని భారతీయులు అంగీకరించారని ఆత్మవిశ్వాసంతో చెప్పగలం.దిగ్భ్రాంతికరమైన విషయమేమిటంటే అభివృద్ధి చెందుతున్న దేశాలు బహిరంగ ఆర్థిక వ్యవస్థలుగా మార్పు చెందుతుండగా స్వేచ్ఛా వాణిజ్యానికి ఆద్యులు అయిన అభివృద్ధి చెందిన దేశాలు తమ ఆర్థిక వ్యవస్థల 'సంరక్షణ' విధానాలకు మళ్లాయి. ఈ విషయంలో అమెరికా పథనిర్దేశం చేసింది. అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ నాయకత్వంలో ఆ దేశం ఈ విషయంలో మరింత ముందంజ వేసింది. తాత్కాలిక సంక్షోభాన్ని నివారించేందుకు 'సంరక్షణ' చర్యలు చేపట్టడాన్ని అర్థం చేసుకోవచ్చు. అయితే 'సంరక్షణవాదం'ను అధికారిక ఆర్థిక విధానంగా మార్చుకోవడాన్ని ఎలా చూడాలి? భారీ సుంకాలు విధించడమే ట్రంప్ అభిమతం. అందుకు ఆయన ఎవరికీ ఎటువంటి సంజాయిషీ ఇవ్వరు. అపారదర్శక టారిఫేతర చర్యలకు పూర్తిగా అనుకూలుడు. అంతేనా? దిగుమతులను ఆయనెంతగానో నిరుత్సాహపరుస్తున్నారు, పనిగట్టుకుని ప్రతి దేశంతో వాణిజ్య సమతౌల్యతను సాధించేందుకు ఆరాటపడుతున్నారు. అమెరికన్ కంపెనీలు తమ ఫ్యాక్టరీలను అమెరికాలోనే నెలకొల్పుకోవాలి, అమెరికాయేతర దేశాలలో వాటిని నిర్వహించకూడదని ఆంక్షలు విధిస్తున్నారు. తన ఆకాంక్షలను తాను విధించే సుంకాలు నెరవేరుస్తాయని ట్రంప్ విశ్వసిస్తున్నారు.అమెరికన్ కంపెనీలు తమ ఫ్యాక్టరీలను మళ్లీ స్వదేశానికి తీసుకురావాల్సిందేనని ట్రంప్ గట్టిగా వాదిస్తున్నారు. అలా 'దేశభక్తి' చూపని కంపెనీలు అనేక ఆంక్షల నెదుర్కోవలసి ఉంటుందని హెచ్చరిస్తున్నారు. 'ఇది చేయడం కంటే చెప్పడం తేలిక 'అని హార్వర్డ్ బిజినెస్ రివ్యూ వ్యాఖ్యానించింది, లేదు, నిరసించింది. 'ఒక వస్తువును ఉత్పత్తి చేయడంలో అనేక ప్రక్రియలు ఉంటాయని, వాటన్నిటినీ ఒకే కంపెనీ చేయగలగడం సాంకేతికతలు సంక్లిష్టమైపోయిన ప్రస్తుత కాలంలో అసాధ్యమని, అందుకు అవసరమైన నైపుణ్యాలను ఒకే ఒక్క ప్రదేశంలో సమీకరించడం అంతకంటే అసాధ్యమని' ఆ పత్రిక నిష్కర్షగా చెప్పింది. 21వ శతాబ్ది వస్తూత్పత్తి కార్యకలాపాల సంక్లిష్టతలపై ట్రంప్‌కు ప్రాథమిక అవగాహన కూడా లేదని, ఆయన కాలానికి అనుగుణమైన అధునాతన ఆలోచనలు ఉన్న వ్యక్తి కానేకాదని' అర్థశాస్త్ర విజ్ఞుడు ఒకరు విమర్శించారు. తన లక్ష్యాల సాధనకు సుంకాలను ఆయుధాలుగా ట్రంప్ ఉపయోగించుకుంటున్నారు. తనతో ఏకీభవించి తన షరతులకు అంగీకరించిన ఆస్ట్రేలియా, ఇండోనేసియా, జపాన్, దక్షిణ కొరియా ప్రయోజనాలకు అనుకూలంగాను, తనతో విభేదించిన కెనడా, ఫ్రాన్స్, బ్రిటన్, బ్రెజిల్ ప్రయోజనాలకు ప్రతికూలంగాను ఆయన నిర్ణయాలు తీసుకున్నారు. రష్యా నుంచి చమురు దిగుమతి చేసుకుంటున్నందుకు జరిమానాతో సహా భారత్‌పై 50 శాతం సుంకాలు విధించారు. ట్రంప్ సుంకాలపై ఆవశ్యక చర్యలు చేపడతామని న్యూఢిల్లీ ప్రతిస్పందించింది.

# 5 కిలోమీటర్లు డోలి యాత్ర - గిరిజనుల వినూత్న నిరసన

**మేము, మా డోలీ బతుకులు గుర్తున్నాయా సారూ!**

**ప్రభుత్వ నిర్లక్ష్యతీరుపై గిరిజనుల నిరసన**

**గతంలో క్షేత్రస్థాయిలో ఉపముఖ్యమంత్రి పవన్ హామీల వర్షం ఒక్కటీ నెరవేరని వైనం**



(అనకాపల్లి),ఆగస్టు 9(టుడే విదుర): : అంతర్జాతీయ గిరిజన దినోత్సవం వేళ ఆదివాసీ ప్రజలు వినూత్న రీతిలో నిరసన ప్రదర్శన చేపట్టారు. గతంలో ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ క్షేత్రస్థాయిలో పర్యటించి హామీల వర్షం కురిపించారు. కానీ వాటిలో ఏ ఒక్కటి నెరవేరలేదు. ఇప్పుడు మళ్లీ అడవి బిడ్డల సమస్యలు తెలుసుకునేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మన్యసీమలో పర్యటించనున్నారు. ఈ నేపథ్యంలో తమ సమస్యలు పరిష్కరించాలంటూ అనకాపల్లి జిల్లా రోలుగుంట మండలం ఆర్ల పంచాయతీ పరిధి కొండ శిఖర పివిటిజి గిరిజన గ్రామాల ప్రజలు శుక్రవారం వినూత్నంగా నిరసన తెలిపారు. పిత్రిగెడ్డ, నీళ్లబంద, పెద్దగరువు, లోసింగి, కొత్త లోసింగి గ్రామాల వాసులతోపాటు అల్లూరి జిల్లాలోని జాజులబంద గ్రామానికి చెందిన ప్రజలూ ఈ కార్యక్రమంలో పాల్గన్నారు. తమ గ్రామాలకు నేటికీ సరైన రోడ్లు, తాగునీరు, పాఠశాలలు లేవని ఆవేదన వ్యక్తం చేస్తూ ఐదు కిలోమీటర్లు మేర డోలీలు పట్టుకొని, అడ్డాకులు కట్టుకొని అర్ధనగ ప్రదర్శన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ%ొ% తమ గ్రామాల్లో సుమారు 680 మంది జనాభా ఉన్నారని, రోడ్లు, మంచినీటి సౌకర్యం కల్పించాలని, అంగన్‌వాడీ భవనాలు, పాఠశాలలు ఏర్పాటు చేసి ఉద్యోగులను నియమించాలని, కమ్యూనిటీ హెల్త్ వర్కర్లను ఏర్పాటు చేయాలని కోరారు. ఆర్ల నుంచి పిత్రిగెడ్డ, జాజులబంద గ్రామాలకు తామే రూ.ఆరు లక్షల మేర చందాలు వేసుకుని రోడ్డు వేసుకున్నామని, అది వర్షాలకు కొట్టుకుపోయిందని తెలిపారు. తరువాత ఐటిడిఎ ద్వారా రోడ్డు మంజూరైనా అది మధ్యలోనే నిలిచిపోయిందన్నారు. పల్లె పండగ కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఇచ్చిన హామీ నెరవేరలేదన్నారు. దీంతో తమకు డోలీ మోతలే శరణ్యమవుతున్నాయని తెలిపారు. జాజులబంద, లోసింగి గ్రామాల్లో చిన్నారులు, బాలింతలు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అంగన్‌వాడీ సెంటర్ అవసరాల కోసం ఎనిమిది నుంచి 20 కిలోమీటర్ల మేర ఆయా గ్రామాల నుంచి నడుచుకుని వెళ్లాల్సి వస్తోందని వాపోయారు. తాగునీటి కష్టాలూ వెంటాడుతున్నాయని వాపోయారు. అనకాపల్లి జిల్లాలోని నాన్ షెడ్యూల్డ్ గ్రామాలను షెడ్యూల్డ్ ఏరియాలో చేర్చాలని, నర్సీపట్నం కేంద్రంగా సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఐఎఎస్ అధికారిని కేటాయించాలని కోరారు. కార్యక్రమంలో ఆదివాసీ గిరిజన సంఘం ఐదో షెడ్యూల్ సాధన కమిటీ జిల్లా గౌరవాధ్యక్షులు కె.గోవిందరావు, పివిటిజి సంఘం కార్యదర్శి కామేశ్వరరావు, కొర్ర రాజు, కొండతాంబలి వెంకటరావు, కొర్ర కొండబాబు, కిల్లో మహేష్ తదితరులు పాల్గన్నారు.

# సమస్యల నడుమ దళిత వాడి



మామిడికుదురు,ఆగస్టు 9(టుడే విదుర): కూటమి ప్రభుత్వ ఏడాది పాలనంతా సుపరిపాలనగా సాగిపోయింది. వేల కోట్ల రూపాయలతో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను చేపట్టామని కూటమి నేతలు 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమంలో ప్రచారం చేస్తున్నారు. అయితే మండలంలోని పలు దళిత వాడలు పాలకుల నిర్లక్ష్యానికి అద్దం పట్టేవిగా దర్శనం ఇస్తున్నాయి. మండలంలోని బి.దొడ్డవరం సిద్ధార్థనగర్‌లోని ఎస్‌సి సామాజికవర్గం నివసించే ప్రాంతానికి పక్కా రహదారి సౌకర్యం లేక ఆ ప్రాంత ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. గత మూడు దశాబ్దాలుగా తమ ప్రాంతాన్ని పట్టించుకునే పాలకుడే కరువయ్యారని ఆ ప్రాంత వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుత ప్రభుత్వంలోనైనా సిసి రోడ్డు వేయాలని స్థానికులు కోరుతున్నారు. అలాగే పదేళ్ల క్రితం పాటు రేవుపై కాలిబాట వంతెన నిర్మించారు. దీనికి ఇరువైపులా అప్రోచ్ రోడ్డును గాలికి వదిలేశారు. ఆర్ అండ్ బి రోడ్డు నుంచి వంతెన వరకు సుమారు 200 మీటర్ల మేర రైతుల నుంచి భూసేకరణ కోసం నాటి ఆర్‌డిఒ వసంతరాయుడు ఆ ప్రాంతాన్ని పరిశీలించారు. రైతుల కొబ్బరి తోటల్లో నుంచి రాకపోకలు సాగిస్తూ వర్షాకాలంలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మూడేళ్ల క్రితం సర్పంచ్ చెల్లుబోయిన శివరామ సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో ఆ ప్రాంత వాసులందరూ రాత్రి సమయంలో గ్రావెల్‌తో తాత్కాలిక రోడ్డు నిర్మించుకున్నారు. గత మూడేళ్ల నుంచి వచ్చిన వరదలతో ఆ దారి అధ్వానంగా మారింది. ఆందోళనలో సిద్ధార్థనగర్ వాసులుసిద్ధార్థనగర్‌లో రెండు దశాబ్దాల క్రితం 30 కుటుంబాలు నివాసముండేవి. నదీ కోతతో 10 గృహాలు నదీ గర్భంలో కలిసిపోయాయి. నదీ కోత నివారణకు గతంలో నిర్మించిన గ్రోయన్‌కు ఇరు వైపులా రివిట్‌మెంట్ నిర్మాణం చేపట్టకపోవడంతో నదీ కోతతో గృహాలు నాశనం అవుతున్నాయి. జల జీవన మిషన్ నిధులతో వేచిన పైప్‌లైన్ మెరక ప్రాంతం కావడంతో తాగునీటి ఇబ్బందులను ఆ ప్రాంత వాసులు ఎదుర్కొంటున్నారు.

# వేగం పుంజుకున్న సేద్యం

గుంటూరు, ఆగస్టు 9(టుడే విదుర): గురటూరు, పల్నాడు జిల్లాల్లో ఖరీఫ్ సాగు వేగం పుంజుకుంది. రెండు జిల్లాల పరిధిలో విస్తారంగా వర్షాలు కురుస్తుండటంతో ఖరీఫ్ సాగు పనులు రైతులు వేగిరపర్చారు. పల్నాడు జిల్లాలో మొత్తం 4.55 లక్షల ఎకరాల విస్తీర్ణంలో సాగవుతుందని అంచనా వేయగా ఇప్పటి వరకు లక్ష ఎకరాల్లో సాగైంది. మిర్చి సాగుపై రైతులు తటపటాయిస్తున్నారు. ఎక్కువ మంది రైతులు పత్తి, వరి, కంది, మొక్కజొన్న సాగుపై దృష్టి పెట్టారు. గుంటూరు జిల్లాలో డెల్టా పరిధిలో వరి సాగు ఉధృతంగా సాగుతోంది. పత్తి, మొక్కజొన్న, అపరాల సాగుపై రైతులు ఆసక్తి కనబరుస్తున్నారు. నాగార్జున సాగర్‌లో గరిష్ట నీటి మట్టం 590 అడుగులు కాగా శుక్రవారం రాత్రి 589 అడుగుల వద్ద నీటి నిల్వ ఉంది. ఇప్పటికే సాగర్ కాల్వలకు నిత్యం 15 వేల క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. అంతేగాక పులచింతల జలాశయం కూడా దాదాపుగా నిండటంతో డెల్టాకు ఈ ఏడాది నీటి ఎద్దడి దాదాపుగా ఉండదంటున్నారు. ప్రస్తుతం అటు సాగర్ ఆయకట్టులో, ఇటు డెల్టాలో నీటి ఎద్దడి తొలగిపోవడం వల్ల గత వారం రోజుల్లో సాగు ఊపందుకుంది. గుంటూరు జిల్లాలో జిల్లా మొత్తం మీద ఈఏడాది ఖరీఫ్‌లో 2.25 లక్షల ఎకరాల్లో పంటలను సాగు చేస్తారని అంచనా వేయగా ఇప్పటి వరకు లక్షా 10 వేల ఎకరాల్లో వివిధ రకాల పంటలసాగు జరిగింది. ప్రధానంగా 85 వేల ఎకరాల్లో వరి సాగు జరిగింది. ఎక్కువ మందిరైతులు వరి వెదపద్ధతిలో సాగు చేశారు. కొంత మంది నాట్లు వేసే పద్ధతిని అవలంభిస్తున్నారు. ప్రస్తుతం తాడికొండ, ప్రత్తిపాడు, పొన్నూరు నియోజకవర్గంలోని చేబ్రోలు, పెదకాకాని మండలాల్లో 20 వేల ఎకరాల్లో పత్తి సాగు చేశారు. మరో ఐదు వేల ఎకరాల్లో ఇతర పంటలు సాగు చేశారు. పల్నాడు జిల్లాలో 4.5 లక్షల విస్తీర్ణంలో సాగు చేయాల్సిఉండగా 95 వేల ఎకారల్లోనే వివిధ రకాల పంటలను సాగు చేశారు. ప్రధానంగా ఈ ఏడాది మిర్చిసాగుకు విముఖత వ్యక్తం చేస్తున్న రైతులు ప్రత్తి, కంది, మొక్కజొన్న, శనగ పంటల సాగు వైపు దృష్టి సారించారు. లక్ష ఎకరాల్లో వరి సాగు చేస్తారని అంచనా ఉండగా ఇప్పటి వరకు కేవలం వెయ్యి ఎకరాల్లోనే వరి నాట్లు వేశారు.

# ట్రాన్స్‌ఫార్మర్ల సమస్యకు పరిష్కారం



సంతమాగులూరు,ఆగస్టు 9(టుడే విదుర): మండలంలోని మిన్నేకల్లు గ్రామంలోని వ్యవసాయ బోర్లకు ప్రభుత్వం విద్యుత్ కనెక్షన్లు ఇచ్చింది. ఏడేళ్లుగా ఆపరిష్కృతంగా ఉన్న సమస్యకు మంత్రి గొట్టిపాటి రవికుమార్ చొరవతో పరిష్కారం లభించిందని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మిన్నేకల్లు గ్రామానికి చెందిన 25 మంది రైతులు తంగేడుమల్లి మేజర్ చివరి ఆయ కట్టులో భూములు ఉన్నాయి. ఇక్కడకు సక్రమంగా నీరు సరఫరా కాకపోవడంతో రైతులే వ్యవసాయ బోర్లు ఏర్పాటు చేసుకు న్నారు. అయితే వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ కోసం వీరు ఏడేళ్లగా అధికారులు చుట్టూ కాళ్లు అరిగేలా తిరిగారు. దీంతో చేసేది లేక బోర్లలోని నీటి ట్రాక్టర్ల జనరేటర్లు, ఆయిల్ ఇంజన్ల ద్వారా తోడుకొన్నారు. దీంతో ఏటా ఒక్కో ఎకరానికి రూ.50 వేల నుంచి రూ.60 వేల వరకు అదనపు ఖర్చు వస్తోంది. దీంతో ఈ విషయాన్ని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టి పాటి రవికుమార్ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఆయన అధికారులతో మాట్లాడారు. మొత్తం 2.5 కిలోమీటర్ల నూతన లైన్ ఏర్పాటు చేయడం, లోవోల్టేజీ రాకుండా ఏడు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు అవసరమని గుర్తించారు. ఆ మేరకు రూ. 30 లక్షల మేర ఖర్చవుతుందని అంచనా వేశారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం 17 మంది రైతుల దరఖాస్తు చేసుకోగా, రైతులకు ప్రభుత్వం ఇంత మొత్తం వెచ్చించే అవకాశం లేదని మంత్రి దృష్టికి తీసుకువెళ్లారు.

# భారీ వాహనాలకు చెక్



రాజోలు,ఆగస్టు 9(టుడే విదుర): డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ – పశ్చిమ గోదావరి జిల్లాల పరిధిలో వశిష్ట గోదావరిపై ఉన్న దిండి – చించినాడ వంతెన ప్రమాదంలో ఉందని జాతీయ రహదారుల శాఖ ఇంజినీర్లు గుర్తించారు. బేరింగులు దెబ్బతినడంతో కూలిపోయే ప్రమాదం ఉందని గుర్తించారు. దీంతో దాదాపు మూడు నెలల పాటు భారీ వాహనాల రాకపోకలను నిషేధించారు. కేవలం మూడు టన్నుల లోపు లైట్ వెహికల్స్ మాత్రమే అనుమతి ఉంది. అయితే పరిస్థితిని బట్టి పుర్తిగా వాహనాలను నిలుపుదల చేసే అవకాశం కనిపిస్తుంది. ఈ వంతెన నిర్మాణానికి 1995లో శంకుస్థాపన చేశారు. రూ.150 కోట్లతో రెండున్నర కిలోమీటర్ల మేర ఈ ప్రీ స్ట్రెస్ కాంక్రీట్ వంతెన (పిఎస్‌సి బిడ్జి)ని 2001 నాటికి పూర్తి చేశారు. దీంతో గోదావరిని దాటేందుకు ప్రత్యక్ష కనెక్టవిటీ రోడ్డు ఏర్పడింది. రెండు జిల్లాల మధ్య రవాణా అభివృద్ధి జరిగింది. సాధారణంగా వంతెన నిర్మించిన 20 ఏళ్లకు బేరింగులను మార్చాల్సి ఉంటుంది. అయితే కోస్తా తీరంలోని ఉప్పునీటి గాలులు, పర్యావరణ మార్పులకు ఈ బేరింగుల్లో సాంకేతిక లోపాలు వచ్చి ముందుగానే బలహీనపడ్డాయి. ఇన్నేళ్ల వరకూ అధికారులు దీన్ని తనిఖీ చేయకపోవడమే నేటి ఈ పరిస్థితికి కారణమని పరిశీలకులు భావిస్తున్నారు. 216 హైవేతో రాకపోకలు ముమ్మరంఆర అండ్ బి నుంచి నేషనల్ హైవేకు ఈ వంతెన బదిలీ కావడం, కత్తిపూడి – ఒంగోలు సాగరమాల 216 జాతీయ రహదారి అందుబాటులోకి రావడంతో రాకపోకలు ముమ్మరం అయింది. రాష్ట్ర విభజన అనంతరం టిడిపి ప్రభుత్వం 216 జాతీయ రహదారి నిర్మాణానికి పచ్చ జెండా ఊపింది. కత్తిపూడి నుంచి ఒంగోలు వరకు సుమారు 250 కిలోమీటర్ల మేర జాతీయ రహదారి విస్తరించింది. రూ.3 వేల కోట్లతో చేపట్టిన ఈ ప్రాజెక్టు 2023లో పూర్తి చేశారు. జిల్లాలో చించినాడ నుంచి లోసరి వరకు 51 కిలోమీటర్ల మేర ఈ రహదారి విస్తరించారు. గతంలో ఒంగోలు నుంచి విశాఖ వెళ్లడానికి విజయవాడ మీదు ఒక్కటే మార్గంగా ఉండేది. ఈ రహదారి పూర్తి కావడంతో కోల్‌కత్తా, ఒడిశా, విశాఖ నుంచి వచ్చే వాహనాలన్నీ కత్తిపూడి మీదుగా ఈ మార్గంలో ఒంగోలు వెళుతున్నాయి. దీంతో ఈ మార్గంలో రేయింబవళ్లు ట్రాఫిక్ రద్దీ అంచనా కంటే భారీగా పెరిగింది. నిర్వహణ కరువు2001లో నిర్మాణం పూర్తి చేసి ఇప్పటికి పాతికేళ్లు అవుతోంది. అయినప్పటికి ఒకటి, రెండు సందర్భాల్లో ఏదో అరకొరగా పైపై పూతలు పూశారు తప్ప. అంతకు మించి ఏమీ చేయలేదు. గడ్డర్లు ఎలా వున్నాయి ? బేరింగ్స్ పరిస్థితి ఏమిటి ?అని పరిశీలించిన దాఖలాలు లేవనే విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. ప్రస్తుతం వంతెనపై పగుళ్లు ఏర్పడడం, గోతులు పడడం, పైకి లేచిన ఇనుప చువ్వలు ప్రమాదకరంగా మారాయి. మరోవైపు బ్రిడ్జి గడ్డర్లతోపాటు 26 బేరింగ్లు పూర్తిగా దెబ్బ తిన్నాయి. రెగ్యులర్ నిర్వహణ లేకపోతే బ్రిడ్జి మనుగడ ఎలా సాగుతుందని స్థానికులు ప్రశ్నిస్తున్నారు.

# రక్తదానం ప్రాణదానంతో సమానం




చింతలపూడి,ఆగస్టు 9(టుడే విదుర): రక్తదానంతో మరో ప్రాణాన్ని కాపాడొచ్చని గోద్రెజ్ సంస్థ సిఇఒ సౌకథా నియోగి అన్నారు. శుక్రవారం గోద్రెజ్ వ్యవస్థాపకులు డాక్టర్ బిపి.గోద్రేజ్ జన్మదిన సందర్భంగా స్థానిక సీతానగరం గోద్రెజ్ పామాయిల్ ఫ్యాక్టరీలో రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది సుమారు వంద మందికిపైగా రక్తదానం చేశారు. రక్తదానం చేసిన సిబ్బందిని డిప్తాన్సుగుప్తా, హెచ్ఆర్ సంపత్ శ్రీనివాసరావు, మౌళీశ్వరరావు అభినందించారు. ఈ కార్యక్రమంలో రెడ్‌క్రాస్ పిఆర్ఒ కెవి.రమణ, మండల కోఆర్డినేటర్ పుల్లూరి సోమశేఖరాచార్యులు పాల్గొన్నారు.

# హా..సుపత్రి!



ఏలూరు,ఆగస్టు 9(టుడే విదుర): అన్నీ ఉన్నా.. ఏదో అన్నట్లుగా వుంది ప్రభు త్వాస్పత్రుల తీరు. ఏ ఆస్పత్రికి వెళ్లినా ఏదో సమస్య కళ్లకు కట్టినట్లు కనిపిస్తోంది. టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినా ఆస్పత్రుల తీరు మెరుగుపడలేదు. డాక్టర్ల కొరత వెన్నాడు తోంది. కొన్నిచోట్ల రోగులకు పరీక్షలు చేయాలన్న ఆ తరహా పరిస్థితే మచ్చుకైనా కనిపించలేదు. అత్యవసరమైతే పక్కాగా వందలు చెల్లించి పరీ క్షలు చేయించుకోవాల్సిందే. ఎమర్జెన్సీ వార్డుల్లో ఏసీలు పనిచేయవు. వార్డుల్లో గాలికి పనికి రాని ఫ్యాన్లు కనిపిస్తాయి. వార్డుల్లో హెచ్‌వోడీల దర్శనం ఓ భాగ్యం. కిందస్థాయి అసిస్టెంట్లతోనే సరిపెట్టుకోవాల్సిందే. ఎక్కడా లేనట్లుగా నూజి వీడులో తల్లీ బిడ్డల సంరక్షణ వార్డులో ఏకంగా వైట్ బుక్ తెరిచారు. అభివృద్ధి, సంక్షేమంటూ ఏ పేషంట్ అయినా ఆ బుక్‌లో కొంత చెల్లించినట్టు లిఖిత పూర్వకంగా నమోదు చేయవచ్చు. అత్య వసర పరిస్థితిలో ఆస్పత్రులకు అంబులెన్స్‌లో వైద్యానికి వెళితే చాలు.. క్షణాల్లో అక్కడి నుంచి వేరే ఆస్పత్రికి రిఫర్ చేస్తూ పంపేస్తారు. ఏలూ రులో ప్రభుత్వ మెడికల్ కాలేజీ పరిధిలోని ఆస్పత్రిలో సీటు లో రోగులకు అందుబాటులో కనిపిం చేది వేళ్లపై లెక్కించే వారే. ప్రభుత్వాసుపత్రిలో తాజా పరిస్థితులను గమనించేం దుకు గురు, శుక్రవారాల్లో విజిట్ నిర్వహించింది.

నూజివీడులో చేతులు తడపాల్సిందే

నూజివీడు టౌన్ : రెండేళ్ల క్రితం నిర్మాణం పూర్తి చేసుకున్న నూజివీడు ఏరియా ఆసుపత్రి నూతన భవనంలో ఎట్టకేలకు ఇటీవల వైద్య సేవలు ప్రారంభమయ్యాయి. మొత్తం 23 మంది వైద్యులు ఉండాల్సి ఉండగా, ఏడు వైద్యు ల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. పూర్తిస్థాయి సదుపాయాలు లేక రోగులు నిలువు కాళ్ళ మీద నిలబడక తప్పని పరిస్థితి. సాధారణ రోజుల్లో 250కి పైబడి అవుట్‌పేషెంట్లు నమోదు అవు తుండగా, సోమవారం 400 నుంచి 500 మంది వరకు ఓపీ నమోదవుతోంది. లేబర్ వార్డు (సీమాంక్, ప్రసూతి) విభా గంపై పలు ఆరోపణలు రోగుల నుంచి వినిపిస్తు న్నాయి. కాన్పుల విష యంలో ఇక్కడ కింది స్థాయి నుంచి పైస్థాయి వరకు చేతులు తడపాలని, ఆడపిల్ల పుడితే ఒక రేటు, మగపిల్లవాడు పుడితే మరో రేటు కింద వెయ్యి నుంచి రూ.2వేల వరకు వసూలు చేస్తున్నారని వాపోతున్నారు. వీల్‌చైర్లు, స్ట్రెక్చర్లు ఉపయోగించేందుకు సైతం డబ్బులు వసూలు చేస్తున్నారని, డొనేషన్ బుక్ పేరుతో సైతం ఈ వసూళ్లు సాగుతున్నాయంటూ నూజివీడు ఐద్వా కమిటీ అధ్యక్షురాలు నందూరి పద్మాంజలి, ఐద్వా నాయకులు బొబ్బిలి కుమారి ఆరోపించారు. దీనిపై సూపరింటెండెంట్ పద్మజారాణిని వివ రణ కోరగా డబ్బుల వసూలు తన దృష్టికి రాలే దని, విచారించి చర్యలు చేపడతానన్నారు. ప్రమాదాల ఘటనలో విషమంగా ఉన్న రోగుల ను విజయవాడకు రిఫర్ చేస్తున్నట్టు తెలిపారు. ఎన్టీఆర్ వైద్యసేవ కింద 110 శస్త్ర చికిత్సలు నిర్వహించినట్టు తెలిపారు.

# సచివాలయంలో ఎస్పీఎఫ్ సిబ్బందికి ఆటల పోటీలు



అమరావతి,ఆగస్టు 9(టుడే విదుర): స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో ఏపీ స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్ విజయవాడ జోన్ స్పోర్ట్స్ మీట్ జరిగింది. వాలీబాల్,బాడ్మింటన్ పోటీలను ఏపీఎస్పీఎఫ్ డీజీ త్రివిక్రమవర్మ,ఐజీ రామిరెడ్డి ఆదేశాలతో విజయవాడ జోన్ కమాండెంట్ ముద్దాడ శంకరరావు ప్రారంభించారు.ఈ సందర్భంగా శంకరరావు మాట్లాడుతూ ఆటల పోటీలు దైనందిన జీవితంలో ఒత్తిడిని తగ్గిస్తాయని,వ్యక్తిత్వాన్ని మెరుగుపరుస్తాయని చెప్పారు.రాష్ట్ర సచివాలయ చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్ పీవీఎస్ఎన్ మల్లికార్జునరావు మాట్లాడుతూ ఆటలు సమష్టి కృషిని,మానసిక,శారీరక దృఢత్వాన్ని పెంపొదిస్తాయని అన్నారు. విజయవాడ జోన్‌లోని ఏపీ సెక్రటేరియేట్, ఏపీ హైకోర్టు, విజయవాడ గాడ్స్,ఇబ్రహీపట్నం ఎన్టీపీఎస్, గన్నవరం ఎయిర్‌పోర్ట్ నుంచి ఎస్పీఎఫ్ సిబ్బంది ఈ పోటీల్లో పాల్గొన్నారు. విజేతలకు బహుమతి ప్రదానం చేశారు.

# ఇస్తారా..ఎలాగని!

కాకినాడ,ఆగస్టు 9(టుడే విదుర): ఉమ్మడి జిల్లాలో సీనరేజి వసూళ్ల కాంట్రాక్టు గడువు ముగియడంతో మళ్లీ దక్కించుకునేం దుకు సుధాకర్ ఇన్‌ఫ్రా పావులు కదుపుతోంది. గత నెల 13వ తేదీతో కాంట్రాక్టు రద్దవడంతో తిరిగి వర్క్ ఆర్డరు తెచ్చుకునేందుకు పైరవీలు ముమ్మరం చేసింది. గత వైసీపీ హయాంలో అడ్డగోలుగా ఈ కంపెనీకి జగన్ సర్కారు రెండే ళ్లపాటు సీనరేజీ వసూలు కాంట్రాక్టు కట్టబె ట్టేసింది. దీంతో ఎక్కడికక్కడ ముక్కుపిండి సీన రేజీ వసూళ్లు చేసి కోట్లకు కోట్లు లాభాలు అర్జిం చారు. అయితే గడువు ముగియడంతో సదరు సంస్థ తిరిగి మళ్లీ దక్కించుకునేందుకు తెగ ప్రయత్నాలు చేస్తోంది. ప్రభుత్వం టెండర్లు పిలిస్తే కాంట్రాక్టు దక్కుతుందో లేదోనన్న అను మానంతో ముందే పైరవీలకు దిగుతోంది. నెల్లూరుకు చెందిన సదరు కాంట్రాక్టరు ఇప్పటికే గనుల శాఖకు రూ.25 కోట్ల వరకు బాకీ పడ్డా రు.అధికారులు ఒత్తిడి తెచ్చినా కట్టలేదు.మరో పక్క ఇటీవల కాంట్రాక్టు గడువు ముగుస్తోన్న సమయంలో ఉమ్మడి జిల్లావ్యాప్తంగా సదరు కంపెనీ ప్రతినిధులు బిల్లులే లేకుండా నేరుగా నగదు వసూలు చేయడం వివాదాస్పదమైంది.

అప్పట్లో అప్పనంగా కొట్టేసి...

ఉమ్మడి జిల్లాలో భారీ నల్లరాతి కొండలు, గ్రావెల్, మట్టి,లేటరైట్ తవ్వకాలకు అనుమతు లివ్వడం ద్వారా ఏటా కోట్లలో ఆదాయం ప్రభు త్వానికి సమకూరుతోంది. ప్రత్తిపాడు, తుని, పెద్దాపురం, రాజమహేంద్రవరం రూరల్, రాజా నగరం, సీతానగరం, పి.గన్నవరం, రాజోలు, ముమ్మిడివరం తదితర నియోజకవర్గాల్లో క్వారీ, గ్రావెల్, మట్టి తవ్వకాల ద్వారా గనుల శాఖకు అధిక రాబడి వస్తోంది. ఉమ్మడి తూర్పుగోదా వరి జిల్లా గనుల శాఖకు ఏటా రూ.407 కోట్ల వరకు రాబడి వచ్చేది. గత వైసీపీ ప్రభుత్వ పెద్దలు దీనిపైనే కన్నేశారు. చిన్న తరహా ఖని జాల సీనరేజి వసూలు బాధ్యత నుంచి గనుల శాఖను పక్కన పెట్టి మూడో కంటికి తెలి యకుండా మొట్టమొదటిసారిగా సుధాకర్ ఇన్‌ఫ్రా అనే ప్రైవేటు కంపెనీకి కట్టబెట్టేశారు. 2023 ఏప్రిల్ నుంచి 2025 ఏప్రిల్ వరకు రెండేళ్లపాటు ఇచ్చారు. రెండేళ్లకు కలిపి కేవలం ప్రభుత్వానికి రూ.233 కోట్లు చెల్లిస్తే చాలని షరతు విధించారు. అది కూడా నెలకు రూ.9.70 కోట్ల చొప్పు న 24 వాయిదాల్లో చెల్లించే వెసులు బాటు ఇచ్చారు. భారీగా ఆదాయం పిండాల్సిన చోట కారుచౌకగా కట్టబెట్టేసి తెరవెనుక అప్పటి ప్రభుత్వ పెద్దలు కోట్లలో నొక్కేశారు.

మళ్లీ మాకే దక్కాలి...ప్రస్తుతం ఉమ్మడి జిల్లాలో సీనరేజీ కాంట్రా క్టు రద్దయి 25 రోజులు అవుతోంది. దీంతో తిరిగి ప్రభుత్వం కొత్తగా టెండర్లు పిలిచి సీనరేజీ వసూలు అర్హత గల కంపెనీకి కట్టబెట్టాలి. అయితే ఇంకా కసరత్తు మొదలవలేదు. ఇటీవల ప్రభుత్వం కొన్ని ఉమ్మడి జిల్లాలకు కొత్తగా సీన రేజీ వసూళ్లకు ప్రైవేటు సంస్థలను ఆహ్వానిస్తూ టెండర్లు పిలిచింది. గడువు ముగిసిన జిల్లాలకు ఇంకా టెండర్లు పిలవలేదు. త్వరలో వీటిని జారీ చేసే అవకాశం ఉంది. కొత్త కంపెనీ ఖరారయ్యే వరకు ప్రస్తుతం ఉమ్మడి జిల్లాలో గనులశాఖ సీనరేజీ వసూలు చేస్తోంది. ఆన్‌లైన్ ద్వారా చెల్లింపులు స్వీకరిస్తోంది.

# మాదక ద్రవ్యాల జోలికి వెళ్లొద్దు



ఆదోని, ఆగస్టు 9(టుడే విదుర): మాదక ద్రవ్యాల జోలికి వెళ్లొద్దని డీఎస్పీ హేమలత సూచించారు. శుక్రవారం స్థానిక రోషన్ గార్డెన్‌లో మాదక ద్రవ్యాల వినియోగం, నష్టాలపై అవగాహన సదస్సు నిర్వహిం చారు. డీఎస్పీ మాట్లాడుతూ యువతతోనే దేశాభివృద్ధి సాధ్యమని, ఒత్తిడికి లోనై సినిమాలు, ఇతర ప్రచార మాధ్యమాల ప్రభావంతో డ్రగ్స్‌కు అలవాటు పడటం విచారకరమన్నారు. ఒత్తిడిని జయించేందుకు యోగా, ధ్యానం, క్రీడలపై దృష్టి సారించాలన్నారు. కళాశాలల యాజమాన్యాలు చదువుతో పాటు సాంస్కృతిక కార్యక్రమాలు, క్రీడలను ప్రోత్సహించాలని, పాఠశాలలు, కళాశాలలకు వంద మీటర్ల లోపు సిగరెట్లు, మద్యం విక్రయించకూ డదన్నారు. ఈ నిబంధనను ప్రతిఒక్కరూ పాటించాల్సిందేనని హెచ్చరించారు. మాదక ద్రవ్యాల నియంత్రణకు ప్రభుత్వం చర్యలు తీసుకుందని, డ్రగ్స్ వినియోగించినా, విక్రయించినా నేరమన్నారు. కేసు నమోదైతే పదేళ్లకు పైబడి జైలు శిక్ష, రూ.లక్షకు పైగా జరిమానా ఉంటుందన్నారు. జైలు శిక్ష అనంతరం బయటకు నిందితులపై పోలీసు నిఘా ఉంటుందని, ఎక్కడ ఆ కేసుకి సంబంధించిన మూలాలు ఉన్నా పోలీసు స్టేషన్‌లో విచారణకు హాజరుకావాల్సి ఉంటుందని హెచ్చరించారు. సీఐ నల్లప్ప, గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

# గిరిజన రైతుకు తీపి కబురు



పాడేరు,ఆగస్టు 9(టుడే విదుర): ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వం పాడేరు ఐటీడీఏ పరిధిలోని గిరిజన రైతులకు తీపి కబురుచెప్పింది. కొత్తగా లక్ష ఎకరాల్లో గిరిజనులతో కాఫీ తోటలు సాగు చేయించాలని నిర్ణయించింది. రానున్న ఐదేళ్ల కాలంలో.. అంటే 2026–27 నుంచి 2030–31 వరకు ఈ ప్రాజెక్టును అమలు చేయడానికి కార్యాచరణను ప్రకటించింది. ఇదే సమయంలో దాదాపు 70 వేల ఎకరాల్లో ఇప్పటికే వున్న కాఫీ తోటల్లో దిగుబడులు పెంచడానికి పునరుజ్జీవ చర్యలు చేపట్టాలని ఆదేశించింది. కొత్తగా లక్ష ఎకరాల్లో కాఫీ సాగు, పాత తోటల పురుజ్జీవనానికి సుమారు రెండు వందల కోట్ల రూపాయలు కేటాయించింది. గిరిజనులను పోడు వ్యవసాయం నుంచి బయటకు తీసుకువచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం 1989లో పాడేరు ఏజెన్సీలో ఆదివాసీలకు కాఫీ సాగును పరిచయం చేసింది. 2002 కాఫీ తోటల అభివృద్ధి అంతమాత్రంగానే వుంది. ఈ కాలంలో 32,072 ఎకరాల్లో మాత్రమే కాఫీ తోటలు వేశారు. తరువాత ఏజెన్సీలో కాఫీ సాగును అభివృద్ధి చేయాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం పలురకాల రాయితీలు, ప్రోత్సాహకాలు అందించింది. ఫలితంగా 2003 నుంచి 2008 వరకు ఆదివాసీ రైతులు 64,265 ఎకరాల్లో కాఫీ తోటలు వేశారు. తర్వాత 2009లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంయుక్తంగా కాఫీ ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టాయి. దీంతో 2016 వరకు 61,684 ఎకరాల్లో, ఈ తరువాత నుంచి ఇప్పటి వరకు మరో 84 వేల ఎకరాల్లో కాఫీ తోటలు వేశారు. మొత్తం మీద ఏజెన్సీ వ్యాప్తంగా ప్రస్తుతం రెండు లక్షల 62 వేల ఎకరాల్లో కాఫీ తోటలు వున్నాయి. వీటి ద్వారా 2.36 లక్షల మంది గిరిజన రైతులు లబ్ధిపొందుతున్నారు. ఇవి కాకుండా గిరిజన రైతులు సొంతంగా వేసుకున్న సుమారు 30 వేల ఎకరాలతో కలిపి మొత్తం 2 లక్షల 92 వేల ఎకరాల్లో కాఫీ తోటలు వున్నాయి. కానీ వివిధ కారణాల వల్ల లక్షా 52 వేల ఎకరాల్లోనే పంట వస్తున్నది. ఇది కూడా 70 వేల టన్నులకు అటుఇటుగా వుంటున్నది. ఎకరా కాఫీ తోట నుంచి ఏటా రూ.40–50 వేల ఆదాయం వస్తున్నది. ఇటు ప్రభుత్వ ప్రోత్సాహంతోపాటు సంతృప్తికరమైన ఆదాయం వస్తుండడంతో కాఫీ తోటల పెంపకంపై గిరిజన రైతులు ఆసక్తి చూపుతున్నారు. అలాగే సేంద్రీయ సాగు ద్వారా కాఫీ ఉత్పత్తి జరగడంతో జాతీయ, అంతర్జాతీయ మార్కెట్‌లో గిరాకీ పెరిగింది.

# టీచర్ల జీతాలకు లైన్‌క్లియర్



ఒంగోలు విద్య, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి జిల్లాలో జూన్‌లో బదిలీ అయిన, ఉద్యోగోన్నతి పొందిన ఉపాధ్యాయుల జీతాల చెల్లింపులకు ఎట్టకేలకు లైన్‌క్లియర్ అయింది. పాఠశాలల పునర్ వ్యవస్థీకరణ, టీచర్ల పునకేటాయింపుతో వారికి జీతాల చెల్లింపులో జాప్యం జరిగింది. జిల్లాలో 5,248 మంది టీచర్లు బదిలీ కాగా ఉద్యోగోన్నతుల ద్వారా 394 మందికి స్థానచలనం కలిగింది. పాఠశాలల పునర్వ్యవస్థీకరణ నేపథ్యంలో ఆరు రకాల స్కూళ్లు తొమ్మిది రకాలుగా మారాయి. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా మోడల్ ప్రైమరీ స్కూళ్లకు శ్రీకారం చుట్టింది. కొత్తగా 1, 2 తరగతులను అదనంగా కలిపి హైస్కూళ్లను 1 నుంచి పది తరగతులకు పెంచింది. దీంతో పాఠశాల కేడర్ స్ట్రెంగ్త్‌లో భారీ మార్పులు చోటుచేసుకున్నాయి. ఈ కారణంగా టీచర్లకు రెండు నెలలుగా జీతాల చెల్లింపులో జాప్యం జరిగింది. ఈ క్రమంలో కొత్త కేడర్ స్ట్రెంగ్త్‌ను నిర్వహించింది. సిబ్బంది, టీచర్లు, హెచ్ఎంలకు కొత్త పొజిషన్ ఐడీలు క్రియేట్ కావడంతో జీతాల చెల్లింపునకు సంబంధించిన సమస్య ఒక కొలిక్కి వచ్చింది. ప్రస్తుతం డీడీవోల లాగిన్‌లోని పాత క్యాడర్ స్ట్రెంగ్త్‌ను ఉపసంహరించారు. కొత్త క్యాడర్ స్ట్రెంగ్త్‌ను కేటాయించాలని ఉన్నతాధికారులు సూచించారు. డీడీవో సంబంధిత సబ్ ట్రెజరీ కార్యాలయాలకు వెళ్లి అక్కడ వేలిముద్రలు వేసి మళ్లీ సీఎఫ్ఎంఎస్ సైట్‌లో లాగిన్ కావాల్సి ఉంది. వీరు ఆ సైట్‌లోకి లాగిన్ అయిన వెంటనే సిబ్బంది, టీచర్ల వివరాలన్నీ డిస్‌ప్లే అవుతాయి. వాటిని పరిశీలించి తమ పాఠశాలల వాస్తవంగా ఉన్న సిబ్బంది, సైట్‌లో చూపిస్తున్న సిబ్బందిని సరిపోల్చుకొని ధ్రువీకరించుకోవాల్సి ఉంది. అన్నీ సక్రమంగా ఉన్నట్లు తేలితే వెంటనే గత రెండు నెలల అరియర్ జీతాలు బిల్లులను సిద్ధం చేసి సమర్పించాల్సి ఉంటుంది. అలా చేస్తేనే ఈనెల రెగ్యులర్ బిల్లు డ్రా చేసేందుకు వీలవుతుంది. శనివారం వెబ్‌సైట్‌లో ఆ బిల్లుల స్వీకరణ ఎనబుల్ అవుతుంది.

# దుర్గగుడిలో భద్రతా విఫలం.. భక్తుల్లో భయం



ఇంద్రకీలాద్రి, ఆగస్టు 9(టుడే విదుర): దుర్గా మల్లేశ్వరస్వామి దేవస్థానంలో భక్తుల లగేజీకి భద్రత కరువైంది. రోజూ వేలమంది భక్తులు దుర్గమ్మ దర్శనానికి దూర ప్రాంతాల నుంచి వస్తూ ఆలయంలో తమ బ్యాగులకు కనీస భద్రత లేకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. శ్రావణ వరలక్ష్మీ వ్రతం విశిష్టత సందర్భంగా వేలాది భక్తులు వివిధ రాష్ట్రాల నుంచి తరలి వచ్చారు. దేవస్థానంలో కొండపైన ఒకటి, కొండ దిగువన ఒకటి లగేజీ బ్యాగులు భద్రపరచుకునే పాయింట్లు ఉన్నాయి. అయితే బ్యాగులు ఉంచేందుకు సరిపడాలేని ఏర్పాట్లు, సిబ్బంది కొరత ఉంది. వేలాదిమంది భక్తులు వస్తారన్నది తెలిసి కూడా దేవస్థానం అధికారులు కనీస చర్యలు తీసుకోకపోవడం ఆశ్చర్యాన్ని కలిగిస్తున్నది. సంబంధిత కాంట్రాక్టరు తనకేమి పట్టనట్టు తూతూమం త్రంగా ఏర్పాట్లు చేసి చోద్యం చూస్తున్నారు. ఒకవైపు దేవస్థానం అధికారులు భక్తులకు మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యం ఇస్తున్నామని చెబుతున్నా అమలులో చిత్త శుద్ధి కనిపించడంలేదు.

# గ్రానైట్ పరిశ్రమపై పిడుగు




చీమకుర్తి, ఆగస్టు 9(టుడే విదుర): గత వైసీపీ ప్రభుత్వ అస్తవ్యస్త విధానాలతో ఇప్పటికే కుదేలైన గ్రానైట్ పరిశ్రమపై మరో భారం పడింది. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఒక్కసారిగా పెంచిన సుంకాలతో ఎగుమతులపై భారీ దెబ్బ పడుతోంది. భారతదేశం నుంచి ఎగుమతి అవుతున్న వాటిపై ఇప్పుడు వసూలు చేస్తున్న వాటికి ఏకంగా 50శాతం అదనపు సుంకాలను అమెరికా విధించింది. గురువారం నుంచి 25శాతం అదనం అమల్లోకి వచ్చింది. మిగతా 25శాతం ఈనెల 27 నుంచి అమలు చేయను న్నారు. గెలాక్సీ, కలర్ గ్రానైట్, క్వార్ట్జ్ తోపాటు ఇంజనీర్డ్ స్టోన్స్‌తో తయారయ్యే గ్యాంగ్‌సా సైజు (300బై180ఎఫ్) శ్లాబులు అమెరికాకు ఎక్కువగా ఎగుమతి అవుతుంటాయి. సుంకాల పెంపుతో ఆయా ఉత్పత్తులపై భారం పడుతుంది. గ్రానైట్ కన్నా ఇంజనీర్డ్ స్టోన్స్ ఎగుమతుదారులపై ఎక్కువ ప్రభావం చూపుతోంది. ఇరుదేశాల మధ్య ద్వైపాక్షిక వాణిజ్య సంబంధాలు పునరుద్ధరణ జరిగితే తప్ప ఈ సుంకాల భారం తొలగిపోయే అవకాశం కనిపించడం లేదు. అప్పటి వరకూ ఉత్పత్తి ప్రక్రియపై సుంకాల ఎఫెక్ట్ పడనుంది. గ్యాంగ్‌సా శ్లాబుల్లో 80శాతానికిపైగా అమెరికాకు ఎగుమతి జిల్లాలోని చీమకుర్తి, రామతీర్థం పరిసర ప్రాంతాల్లో ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన గెలాక్సీ గ్రానైట్ పరిశ్రమ విస్తరించింది. ఇక్కడ 40కిపైగా క్వారీల్లో నిత్యం క్వారీయింగ్ కార్యకలాపాలు నిర్వహిస్తూ గ్రానైట్ ముడిరాయిని వెలికితీస్తున్నారు. ఈ ముడిరాళ్లలో నాణ్యమైనవి సింహభాగం చైనాకు ఎగుమతి అవుతుంటాయి. అక్కడ వీటిని వారు ప్రాసెసింగ్ చేసి శ్లాబులుగా మార్చి అమెరికా, ఇతర దేశాలకు ఎగుమతి చేస్తుంటారు. గెలాక్సీ గ్రానైట్ పరిశ్రమకు అనుబంధంగా కటింగ్ అండ్ పాలిషింగ్ ఫ్యాక్టరీలు జిల్లాలో దాదాపు వెయ్యి వరకూ విస్తరించాయి. వీటిపై ఇప్పుడు విధించిన సుంకాల ప్రభావం పడలేదు. ఎందుకంటే ఈ ఫ్యాక్టరీలలో ఉత్పత్తి అయ్యే చిన్నసైజు శ్లాబులు అమెరికాకు పెద్దగా ఎగుమతి కావు. ఆసియా, యూరప్ దేశాలకు వెళుతుంటాయి. నాణ్యమైన ముడిరాళ్ల నుంచి ఉత్పత్తి అయ్యే గ్యాంగ్‌సా శ్లాబులు మాత్రం 80శాతానికిపైగా అమెరికాకు ఎగుమతి అవుతాయి. వీటిని ఉత్పత్తి చేసే బడా ఫ్యాక్టరీలు చీమకుర్తి, గుండ్లాపల్లి ప్రాంతాల్లో దాదాపు 20 వరకూ ఉన్నాయి. ఇప్పుడిప్పుడే వీటి సంఖ్య పెరుగుతూ వస్తోంది.

# రేషన్ బియ్యం పట్టివేత




ఎలమంచిలి, ఆగస్టు 9(టుడే విదుర): లారీలో అక్రమంగా తరలిస్తున్న సుమారు ఆరున్నర టన్నుల రేషన్ బియ్యాన్ని మండలంలోని ఏటికొప్పాక సమీపంలో రెవెన్యూ అధికారులు పట్టుకున్నారు. ఇందుకు సంబంధించి వివరాలిలా వున్నాయి. ఏటికొప్పాక, పరిసర గ్రామాల్లో రేషన్ కార్డుదారుల నుంచి కొంతమంది దళారులు బియ్యం కొనుగోలు చేసి, రైస్ మిల్లుకు తరలిస్తుంటారు. ఈ నెల ఒకటో తేదీ నుంచి రేషన్ పంపిణీ ప్రారంభం కావడంతో ఆయా కార్డుదారుల నుంచి కొనుగోలు చేసిన బియ్యాన్ని ఏటికొప్పాకలోని ఒక ఇంటిలో భద్రపరిచారు. రాత్రి లారీలోకి బియ్యం బస్తాలను ఎక్కిస్తుండగా చూసిన కొంతమంది స్థానికులు రెవెన్యూ అధికారులకు ఫోన్ చేసి సమాచారం ఇచ్చారు. దీంతో హెచ్‌డీటీ వినయ్‌కుమార్, సిబ్బందితో కలిసి ఏటికొప్పాకకు బయలుదేరారు. దారిలో రైల్వే గేట్లు సమీపంలో ఎదురుగా వస్తున్న లారీని అడ్డుకుని తనిఖీ చేశారు. ఒక్కొక్కటి 50 కిలోల బరువున్న 130 బియ్యం బస్తాలు కనిపించాయి. ఈ బియాన్ని పులపర్తి వైపు తరలిస్తున్నట్టు తమ ప్రాథమిక విచారణలో తేలిందని హెచ్‌డీటీ చెప్పారు. రేషన్ బియ్యంతోపాటు లారీని స్వాధీనం చేసుకుని ఎలమంచిలి తరలించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తదుపరి చర్యలు తీసుకుంటామని హెచ్‌డీటీ వినయ్‌కుమార్ తెలిపారు.

# గుంతలమయం




ఆలూరు, ఆగస్టు 9(టుడే విదుర): మండలంలోని అరికెర–కురువల్లి గ్రామాల మధ్య రహదారిపై గుంతలు పడి వాహనదారులు అవస్థలు పడుతున్నారు. పెద్ద గుంతలు, ముళ్లకంప ఉండటంతో పొలాలకు వెళ్లాలంటే ఇబ్బంది తప్పడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కురువల్లి సమీపంలో పదేళ్ల క్రితం నిర్మించిన కల్వర్టు వరద ధాటికి కొట్టుకు పోరు ప్రజలకు, రైతులకు రాకపోకలకు అంతరాయం కలుగుతోంది. అధికారులు స్పందించి నూతన రహదారిని నిర్మించాలని కురువల్లి సర్పంచ్ ఉప్పర రవి, నాయకులు రమేష్, తిక్కన్న, మల్లయ్య కోరారు.

## ఉప్పుటేరులో యువకుడు గల్లంతు



నరసాపురం, ఆగస్టు 9(టుడే విదుర): నరసాపురం మండలం చినమైన వాని లంక గ్రామంలో శుక్రవారం సాయంత్రం ఉప్పుటేరులో యువకుడు గల్లంతు అయ్యాడు. పోలీసులు, స్థానికుల వివరాల ప్రకారం నరసాపురం పట్టణానికి చెందిన గట్టం గణేష్ (20) అనే యువకుడు ముగ్గురు స్నేహితులతో కలిసి చినమైన వాని లంక బీచ్‌కి వెళ్ళాడు. తిరిగి వస్తుండగా కాళ్ళు కడుక్కునెందుకు కాలువలోకి దిగగా ప్రమాదవశాత్తు కాలు జారి కాలువలోకి కొట్టుకుని పోయాడు. సమాచారం అందుకున్న పోలీసులు, కుటుంబ సభ్యులు యువకుడు ఆచూకి కోసం తీవ్రంగా గాలిస్తున్నారు.

# చెలిమిచేను జలపాత సోయగాలు



రామకుప్పం,ఆగస్టు 9(టుడే విదుర): రామకుప్పం మండలంలో మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలతో కౌండిన్య అభయారణ్యంలో జలపాతాలు హోరెత్తుతున్నాయి. ననియాలతాండా, రామాపురంతాండా, వీర్నమల, బల్ల అటవీప్రాంతాల్లోని వాగులు, వంకలు పొంగి ప్రవహిస్తుండడంతో చెలిమిచేను, బడాలగట్టు జలపాతాలు కనువిందు చేస్తున్నాయి. చెలిమిచేను జలపాతం పైభాగంలో బండరాళ్లను చీల్చుకుంటూ జలాలు ఉధృతంగా కిందకు జాలువారుతున్నాయి. అక్కడి నుంచి చుట్టూ పచ్చనికొండల మీదుగా సుమారు 150 అడుగుల కిందకు హోరు శబ్దం మధ్య జలాలు దూకుతున్నాయి.చెలిమిచేను, బడాగట్టు జలపాతాలకు వెళ్లేందుకు ఉన్న దారులను రహదారులుగా మార్చి, జలపాతాల వద్ద రక్షణ ఏర్పాట్లు చేస్తే ఈ ప్రాంతం పర్యాటకులకు అనువుగా ఉంటుంది. జలపాతాల నుంచి జాలు వారే జలాలు తమిళనాడుకు వృ?థాగా పోతున్నాయి. జలపాతాల దిగువ భాగాల్లో భారీ చెక్‌డ్యాంలు నిర్మించి జలాలను నిలువరిస్తే అటవీ ప్రాంతంతోపాటు ఆరేడు పంచాయతీల్లో భూగర్భజలాలు వృద్ధి చెందుతాయి.

# నమ్రత లిస్టులో 200 మంది దంపతులు!




హైదరాబాద్ సిటీ/అడ్డగుట్ట, విశాఖపట్నం, ఆగస్టు 9(టుడే విదుర): సృష్టి ఫర్టిలిటీ సెంటర్ కేసులో పోలీసు దర్యాప్తు కొనసాగుతోంది. సరగసీ పేరిట 'సృష్టి' నిర్వాహకురాలు డాక్టర్ నమ్రత చేసిన మోసాలు ఒక్కొక్కటిగా బయటికి వస్తున్నాయి. డాక్టర్ నమ్రత సహా 26 మందిని ఇప్పటికే అరెస్టు చేసిన పోలీసులు నమ్రతకు ఏజెంట్లుగా వ్యవహరించిన మరో నలుగురిని కూడా అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు తెలిసింది. ఇందులో విజయ్, సరోజ, రత్న అనే ముగ్గురిని విశాఖపట్నంలో అదుపులోకి తీసుకున్నారు. దీంతో ఈ కేసులో అరెస్టయిన వారి సంఖ్య 30కి చేరింది. అరెస్టయిన వారిలో వైద్యులు, టెక్నీషియన్లు, ఏజెంట్లు, శిశు అక్రమ రవాణా, విక్రయానికి పాల్పడిన దళారులు ఉన్నారు. ఈ కేసులో విశాఖలోని కేజీహెచ్‌లో పని చేస్తున్న మరో ముగ్గురు వైద్యుల పాత్రను కూడా గుర్తించిన పోలీసులు వారినీ అదుపులోకి తీసుకునే అవకాశముంది. సంతానం కోసం తన వద్దకు వచ్చే దంపతులకు సరగసీ ద్వారా సంతానం పొందాలని నమ్రత ఒప్పించేది. ఆమె మాటలను నమ్మిన దంపతుల నుంచి స్పెర్మ్, అండాలు సేకరించి వాటి ద్వారా వేరొకరి గర్భంలో బిడ్డను పెంచుతున్నామని నమ్మించేది. వేరెవరికో పుట్టిన బిడ్డలను ఏజెంట్ల ద్వారా కొనుగోలు చేసి సరగసీ ద్వారా పుట్టిన బిడ్డ అంటూ ఆ దంపతులకు ఇచ్చి లక్షల్లో డబ్బు వసూలు చేసేది. కాగా, నమ్రత మాటలు నమ్మి సరగసీ ద్వారా సంతానం పొందేందుకు తెలుగు రాష్ట్రాల్లోని సృష్టి ఫర్టిలిటీ సెంటర్లలో 200 మంది దంపతులు రిజిస్ట్రేషన్లు చేసుకున్నట్టు పోలీసులు గుర్తించినట్టు సమాచారం. ఆ జాబితా పోలీసుల చేతికి చిక్కినట్టు తెలిసింది. అయితే, నమ్రత బృందం వారిలో ఎంతమందికి సంతానాన్ని అందించింది? ఎంతమందికి చికిత్స కొనసాగుతోంది?అనేది తెలియాల్సి ఉంది. నమ్రత 80మంది శిశువులను విక్రయించినట్టు పోలీసులు ఇప్పటికే గుర్తించిన సంగతి తెలిసిందే. ఆ చిన్నారులను తీసుకున్న వారిలో సరగసీ కోసం రిజిస్ట్రేషన్ చేసుకున్న దంపతులు ఉన్నారా ? ఏ రాష్ట్రం నుంచి ఎంతమంది చిన్నారులను కొనుగోలు చేశారు? అనే అంశాలపై పోలీసులు దృష్టి సారించారు. కాగా, సరగసీ పేరిట ఒక్కో బిడ్డ ద్వారా రూ.40లక్షల దాకా పొందే నమ్రత.. అనతి కాలంలోనే రూ.25 కోట్ల మేర ఆస్తులు కూడబెట్టినట్టు పోలీసుల దర్యాప్తులో తేలింది. కాగా, ఈ కేసులో అరెస్టయిన వైజాగ్, కేజీహెచ్ ఆస్పత్రి అనస్థీషియా విభాగం వైద్యుడు డాక్టర్ వాసుపల్లి రవి వైసీపీ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేశ్‌కు సోదరుడని తెలిసింది.

# గల్ఫ్‌లో 45 వేల మంది తెలంగాణ కార్మికులు



న్యూఢిల్లీ,ఆగస్టు 9(టుడే విదుర): గల్ఫ్ దేశాల్లో 45 వేలకు పైగా తెలంగాణ కార్మికులు ఉన్నారని కేంద్ర విదేశాంగ శాఖ సహాయ మంత్రి కీర్తివర్ధన్ సింగ్ తెలిపారు. విదేశాల్లోని వలస కార్మికుల సమస్యల పరిష్కారానికి, వారి భద్రతకు కేంద్రం అన్ని చర్యలు తీసుకుంటుందని స్పష్టం చేశారు. శుక్రవారం లోక్‌సభలో ఎంపీ ఆర్ రఘురాం రెడ్డి అడిగిన ప్రశ్నకు ఆయన లిఖిత పూర్వకంగా ఈ మేరకు సమాధానం ఇచ్చారు. గల్ఫ్ సహా అన్ని దేశాల్లోని భారతీయ రాయబార కార్యాలయాలు తెలంగాణ కార్మికుల రక్షణ కోసం పనిచేస్తున్నాయని మంత్రి వెల్లడించారు.
అత్యవసర సమయాల్లో సంప్రదించడానికి ఈ మెయిల్, ఫోన్ నంబర్లు, వాట్సాప్, సోషల్ మీడియా వంటి మార్గాలున్నాయని, తక్షణ స్పందన కోసం ప్రత్యేక విభాగాలూ పనిచేస్తున్నాయని తెలిపారు. కాగా, 2024-25 లో తెలంగాణకు కేంద్రప్రభుత్వం పలు పథకాల కింద నిధులు కేటాయించింది. నేషనల్ హెల్త్ మిషన్ (ఎన్‌హెచ్‌ఎం)కింద రూ. 67.16 కోట్లు, ప్రధాన్ మంత్రి ఆయుష్మాన్ భారత్ హెల్త్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ మిషన్ కింద రూ.208.82 కోట్లు మంజూరు చేసినట్లు కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ సహాయ మంత్రి అనుప్రియా పటేల్ లోక్‌సభలో తెలిపారు. శుక్రవారం ఎంపీ కడియం కావ్య అడిగిన ప్రశ్నకు ఆమె సమాధానమిచ్చారు.

# కిర్గిజిస్థాన్‌లో బందీ అయిన కుమారుడు.. విడిపించేందుకు పుస్తెలు తాకట్టుపెట్టిన తల్లి




దుబ్బాక,ఆగస్టు 9(టుడే విదుర): స్థానిక ఏజెంట్ మోసం చేయడంతో సిద్దిపేట జిల్లా దుబ్బాక మండలం బల్వంతపూర్ గ్రామానికి చెందిన రజనీకాంత్‌ను కిర్గిజిస్థాన్‌లో ఓ కంపెనీ అధికారులు బంధించారు. రూ.లక్ష చెల్లిస్తేనే విడుదల చేస్తామని డిమాండ్ చేశారు. దీంతో తన కుమారుడిని విడిపించేందుకు రజనీకాంత్ తల్లి వరవ్వ తన పుస్తెల తాడును తాకట్టు పెట్టి ఆ మొత్తాన్ని చెల్లించింది. దీంతో బందీగా ఉన్న రజనీకాంత్‌ను అక్కడివారు విడిచిపెట్టి అతడి పాస్‌పోర్టును తిరిగి ఇచ్చేశారు. భారత్‌లో ఉన్న ఏజెంట్ మహబూబ్, అతని కుమారుడు అన్వర్ తమను మోసం చేయడం వల్లే తమ డబ్బులు రాబట్టుకోవడానికి రజనీకాంత్‌ను బంధించినట్లు కంపెనీ ఏజెంట్ చెప్పారు.
పాస్‌పోర్టు తిరిగి ఇచ్చేసినట్లు తెలియడంతో తల్లి.. కుమారుడు తిరిగి వచ్చేందుకు మరో రూ.22 వేలతో విమాన టికెట్ బుక్ చేసింది. ఖర్చుల కోసం రూ.10 వేలను కూడా పంపించింది. రజనీకాంత్ శనివారం సాయంత్రం బయలుదేరి ఆదివారం భారత్‌కు చేరుకోనున్నాడు. ప్రభుత్వం స్పందించి బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని, మోసం చేసిన ఏజెంట్లపై చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

# 78 ఏళ్ల వృద్ధురాలిపై లైంగిక దాడి



ఆదిలాబాద్ ఆగస్టు 9(టుడే విదుర): ఆదిలాబాద్‌లో దారుణ ఘటన వెలుగు చూసింది. రహదారి పక్కన నిద్రిస్తున్న ఓ 78 ఏళ్ల వృద్ధురాలిపై గుర్తు తెలియని వ్యక్తి లైంగిక దాడికి పాల్పడ్డాడు. ఆమెను ఎత్తుకెళ్లి నోటిలో గుడ్డలు కుక్కి ఆపై అఘాయిత్యానికి తెగబడ్డాడు. ఆదిలాబాద్‌లో అర్ధరాత్రి ఈ ఘటన జరిగింది. ఆదిలాబాద్, శివాజీచౌక్ రోడ్డు పక్కన నిద్రిస్తున్న వృద్ధురాలిని ఓ దుండగుడు గురువారం అర్ధరాత్రి తర్వాత బలవంతంగా పక్క సందులోకి ఎత్తుకెళ్లాడు. ఓ దుకాణం వద్ద వృద్ధురాలిపై లైంగిక దాడికి పాల్పడ్డాడు. బాధితురాలి కుమారుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

# మహిళా శక్తి ఉద్యోగులకు పెండింగ్ జీతాలు వెంటనే విడుదల చేయాలి




హైదరాబాద్, ఆగస్టు 9(టుడే విదుర): మహిళా శక్తి కేంద్రాల్లో పనిచేస్తున్న ఉద్యోగులకు పెండింగ్‌లో ఉన్న వేతనాలను వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని తెలంగాణ మానవ హక్కుల కమిషన్(టీజీహెచ్ఆర్సీ) ఆదేశించింది. ఈ మేరకు టీజీహెచ్ఆర్సీ ఛైర్మన్ జస్టిస్ షమీమ్ అక్తర్ పేరిట ఓ ప్రకటన విడుదలైంది.
మహిళా శక్తి కేంద్రాల్లో పనిచేస్తున్న సోషల్ కౌన్సిలర్లు, లీగల్ కౌన్సిలర్లు, పోలీసు కానిస్టేబుళ్లు, డేటా ఎంట్రీ ఆపరేటర్లకు వేతనాలు నిరాకరించడం రాజ్యాంగంలోని ఆర్టికల్ 21 ప్రకారం జీవనోపాధి హక్కును ఉల్లంఘిస్తుందని కమిషన్ పేర్కొంది. వెంటనే జీతాలు చెల్లించి, రెండు నెలల్లోపు నివేదిక సమర్పించాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది.
మహిళా శక్తి కేంద్రాల్లో పనిచేస్తున్న సోషల్ కౌన్సిలర్లు, లీగల్ కౌన్సిలర్లు, పోలీసు కానిస్టేబుళ్లు, డేటా ఎంట్రీ ఆపరేటర్లకు వేతనాలు నిరాకరించడం రాజ్యాంగంలోని ఆర్టికల్ 21 ప్రకారం జీవనోపాధి హక్కును ఉల్లంఘిస్తుందని కమిషన్ పేర్కొంది. వెంటనే జీతాలు చెల్లించి, రెండు నెలల్లోపు నివేదిక సమర్పించాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది.

# విద్యుదాఘాతంతో ఇద్దరు రైతుల మృతి



యాలాల, ఆగస్టు 9(టుడే విదుర): పంట పొలానికి నీరుపెట్టేందుకు వెళ్లిన ఇద్దరు రైతులు బోరు మోటారు వద్ద వైర్లను సరిచేస్తుండగా విద్యుత్ షాక్‌తో మృతి చెందారు. వికారాబాద్ జిల్లా యాలాల మండలం ముద్దాయిపేట్‌కి చెందిన పాలేపల్లి రమేశ్ (38) పొలంలో నారుకు నీరు పెట్టేందుకు ఉదయం పొలానికి వెళ్లాడు. పొలంలో ఉన్న బోరు మోటారును ఆన్ చేయగా అది పనిచేయలేదు. దీంతో తెగి కిందపడిపోయిన సర్వీస్ వైరును సరిచేస్తుండగా విద్యుదాఘాతానికి గురై మృతి చెందాడు.
అలాగే, నారాయణపేట జిల్లా ఊట్కూర్ మండలం పగిడిమారినికి చెందిన అస్లాం (33) తన పొలంలో పత్తి పంటను సాగు చేసుకున్నాడు. గురువారం సాయంత్రం పంటకు నీరు పెట్టేందుకు పొలంలోని బోరు మోటారును ఆన్ చేయడానికి వెళ్లి విద్యుత్ వైర్లు తెగిపడటాన్ని గమనించాడు. వాటిని సరిచే స్తుండగా షాక్‌తో చనిపోయాడు.

# డేంజర్ డెంగీ



మహబూబ్‌నగర్ (వైద్యవిభాగం)ఆగస్టు 9(టుడే విదుర): మహబూబ్‌నగర్ జిల్లాలో డెంగీ వ్యాధి డేంజర్ బెల్స్ మోగిస్తోంది. ఇటీవల కురుస్తున్న వర్షాలతో దోమల బెడద అధికమయ్యింది. ప్రధానంగా పగటి సమయంలో కుట్టే టైగర్ దోమతో డెంగీ బాధితుల సంఖ్య పెరుగుతోంది. ఈ ఏడాది జనవరి నుంచి ఇప్పటి వరకు 97 పాజిటివ్ కేసులు నమోదయ్యాయి. గత రెండు నెలల్లోనే 44 కేసులు నమోదు కావడం ఆందోళన కలిగిస్తోంది. ప్రధానంగా పట్టణ ప్రాంతాల్లోనే ఎక్కువ మంది డెంగీ బారిన పడుతున్నారు.

పగటి పూట కుట్టే టైగర్ దోమ

టైగర్ దోమ కుట్టడం వల్ల డెంగీ వ్యాధి వ్యాపిస్తుంది. పగటి వేళ కుట్టే ఈ దోమలు చాలా ప్రమాదకరమైనవి. ఇది కుట్టడంతో డెంగీ జ్వరం, డెంగీ హెమరైజ్డ్, డెంగీ షాక్ సిండ్రమ్ వంటి వైరస్‌లు శరీరంలో చేరతాయి. ఫలితంగా మనిషి శరీరం ఎర్రగా కందిపోవడం, కీళ్లు, కండరాలు, ఒళ్లు నొప్పులు అధికం అవుతాయి. కళ్లు మంటతో మూతలు పడతాయి. వాంతులు కూడా అవుతాయి. ఇది ఒకరి నుంచి మరొకరికి వ్యాపిస్తుంది.

జిల్లా కేంద్రంలోనే అధికం

జిల్లాలో డెంగీ వ్యాధి బాధితుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతుండటం ఆందోళన కలిగిస్తోంది. ఈ ఏడాది జనవరి నుంచి జూలై 31 వరకు జిల్లాలో 97 డెంగీ పాజిటివ్ కేసులు నమోదయ్యాయి. అందులో జూన్, జులై రెండు నెలల్లోనే 44 కేసులు నమోదయ్యాయి. అవి కూడా పట్టణ ప్రాంతాల్లోనే అధికంగా ఉన్నాయి. ప్రధానంగా మహబూబ్‌నగర్ జిల్లాకేంద్రంలోనే అత్యధికంగా 17 కేసులు నమోదయ్యాయి. నగరంలోని పాత పాలమూరు, మర్లు, మోతినగర్, వేపూరిగేరి, వీరన్నపేట, షాషాబ్‌గుట్ట ప్రాంతాలతో పాటు జిల్లా కేంద్రం సమీపంలోని తిమ్మసానిపల్లి, జమిస్తాపూర్, బండమీదిపల్లి, ధర్మాపూర్, క్రిష్టియన్‌పల్లి గ్రామాల్లో ఈ వ్యాధి వేగంగా వ్యాపిస్తోంది. ఈ గ్రామాలతో పాటు నవాబ్‌పేట, జడ్చర్ల, భూత్పూర్, హన్వాడ, దేవరకద్ర, సీసీ కుంట మండలాల్లోనూ వ్యాధి విస్తరిస్తోంది. ఇళ్ల మధ్యనున్న ఖాళీ ప్లాట్లలో విపరీతంగా చెట్లు పెరిగి, మురుగునీరు నిలిచి దోమలు వృద్ధి చెందుతున్నాయి.

# కూలీలు దొరక్క రైతుల అవస్థలు


గుండాల, ఆగస్టు 9(టుడే విదుర): మండలంలో ఇటీవల కురిసిన వర్షాలకు పంట పొలాల్లో పెరిగిపోతున్న కలుపు మొక్కలను తీయలేక అన్నదాతలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గత వర్షాకాలం ప్రారంభమై నెలలు గడుస్తున్నప్పటికీ ఆశించిన వర్షాలు కురవకపోవడంతో ఇన్ని రోజులు నేల గట్టిగా ఉండి పత్తి, కంది చేలల్లో కలుపు తీయలేకపోయారు. ఇటీవల వరుసగా ముసుర్లు పడడంతో పంట పొలాల్లో విపరీతంగా కలుపు పడింది. రైతులందరూ ఒకేసారి కలుపును తొలగించడానికి సిద్ధపడ్డారు. రైతులందరూ ఒకేసారి కలుపు మొక్కలను తొలగించడానికి సిద్ధపడడంతో కూలీల కొరత తీవ్రంగా ఏర్పడుతోంది. రోజు రోజుకూ కలుపు విపరీతంగా పెరిగిపోతోంది. కూలీలు వారి స్వంత గ్రామాల్లో పనులు చేపట్టేందుకు ఆసక్తి చూపకపోవడంతో జనగాం, సూర్యాపేట జిల్లాలోని దేవరుప్పల, లింగాల ఘనపురం, తిరుమలగిరి, పాలకుర్తి తదితర మండలాల నుంచి నిత్యం ఆటోలో కూలీలను తీసుకువచ్చే పరిస్థితి ఏర్పడింది. వివిధ ప్రాంతాల నుంచి వచ్చే కూలీలకు కూలీ డబ్బులతో పాటు అన్నదాతలకు ఆటో చార్జీలు అదనంగా ఇవ్వాల్సి వస్తోంది. గత సంవత్సరం కలుపు తీయడానికి రూ.300 ఉండగా ప్రస్తుతం రూ.400నుంచి 500 వరకు చెల్లించాల్సి వస్తోంది. దీంతో రైతులు అదనంగా నష్టపోవాల్సి వస్తోంది.

# టుడే వినోదం

## తెలుగు సినిమాకు గర్వకారణం..

# మహేష్ బాబుకు మెగాస్టార్ బర్త్ డే విషెస్..






సూపర్ స్టార్ మహేష్ బాబు పుట్టిన రోజు నేడు. ఈ సందర్భంగా ఆయనకు సోషల్ మీడియా వేదికగా సినీతారలు, అభిమానులు బర్త్ డే విషెస్ తెలుపుతున్నారు. ఈరోజు మహేష్ 50వ పుట్టిన రోజు కావడంతో ఈ వేడుకను చాలా ప్రత్యేకంగా జరుపుకుంటున్నారు ఫ్యాన్స్. మహేష్ తో తమకున్న అనుబంధాన్ని చెబుతూ ట్వీట్స్ చేస్తున్నారు. మరోవైపు అతడు రీరిలీజ్ సందర్భంగా థియేటర్ల వద్ద అభిమానుల సందడి వాతావరణం నెలకొంది. ఈ క్రమంలోనే తాజాగా మెగాస్టార్ చిరంజీవి మహేష్ బాబుకు బర్త్ డే విషెస్ తెలిపారు. మహేష్ తెలుగు సినిమాకు గర్వకారణం అంటూ ట్వీట్ చేశారు. "ప్రియమైన మహేష్ బాబుకు 50వ పుట్టినరోజు శుభాకాంక్షలు. నువ్వు తెలుగు సినిమాకు గర్వకారణం. ప్రపంచాన్ని జయించాలనే లక్ష్యంతో ఉన్నావు. సంవత్సరం గడిచేకొద్ది నువ్వు చిన్నవాడివి అవుతున్నావు. రాబోయే సంవత్సరం మరింత అద్భుతంగా ఉండాలని.. ఎన్నో సంతోషకరమైన క్షణాలు రావాలని కోరుకుంటున్నాను" అంటూ విష్ చేశారు చిరు.

# గ్లోబ్‌ట్రోటర్ ఫస్ట్ లుక్ అప్పుడే.. జక్కన్న అప్‌డేట్ అదిరింది..

మహేశ్‌బాబు పుట్టినరోజు సందర్భంగా దర్శకధీరుడు రాజమౌళి బిగ్ అప్‌డేట్ ఇచ్చారు. ఆయన దర్శకత్వంలో మహేశ్ బాబు హీరోగా తెరకెక్కుతున్న 'ఎస్ఎస్ఎంబీ29' చిత్రానికి సంబంధించి అధికారికంగా ఆయన పోస్టర్ రివీల్ చేశారు. 'గ్లోబ్‌ట్రోటర్' అంటూ ఓ ప్రీ లుక్‌ను షేర్ చేసి ఫస్ట్ లుక్ నవంబర్ నెలలో వస్తుందని చెప్పారు. ఈ పోస్ట్‌కు అనే హ్యాష్ ట్యాగ్‌ను జత చేసారు రాజమౌళి. అంటే ప్రపంచాన్ని చుట్టి వచ్చే యాత్రికుడు అని పరోక్షంగా చెప్పినట్లు తెలుస్తోంది. క్షణాల్లోనే ఈ హ్యాష్ ట్యాగ్ ఎక్స్‌లో ట్రెండింగ్‌లోకి వచ్చింది.సినిమా గురించి కూడా రాజమౌళి ఓ నోట్ విడుదల చేశారు. "ప్రపంచవ్యాప్తంగా ఉన్న సినీ ప్రియులు, మహేశ్ ఫ్యాన్స్‌కు, మేం ఈ సినిమా షూటింగ్‌ను ఇటీవల




మొదలుపెట్టాం. దీనిపై ప్రేక్షకులు, అభిమానులు ఆసక్తి చూసి ఎంతో ఆనందంగా ఉంది. ఈ సినిమా భారీ స్థాయిలో రానుంది. కేవలం ప్రెస్‌మీట్ పెట్టి లేదా కొన్ని లుక్స్ రివీల్ చేయడం వల్ల కథకు పూర్తి స్థాయిలో న్యాయం చేయలేము.దీనిని హ్యూజ్ స్పాన్ ఉన్న సినిమాగా రూపొందిస్తున్నాం. నవంబర్ 2025లో మహేశ్ లుక్‌ను విడుదల చేస్తాం. ఇంతకు ముందు ఎప్పుడు చూడని విధంగా దీన్ని రూపొందిస్తున్నాం. మీరంతా సహకరిస్తారని ఆశిస్తున్నాం. మీ ఓర్పుకు ధన్యవాదా లు' అని పేర్కొన్నారు.తెలుగు సినిమా

# కాంతార షూట్.. మరో మరణం.. కారణమేంటి



కాంతార -1 షూటింగ్‌లో వరుస మరణాలు హాట్ టాపిక్‌గా మారాయి. ఇప్పటికే నాలుగు చోట్ల నలుగురు టెక్నీషియన్లు వివిధ కారణాలతో మరణించారు. తాజా సమాచారం ప్రకారం ఈ సినిమాకు పని చేసిన మరో నటుడు మరణించారు. ఈ చిత్రంలో కీలక పాత్ర పోషిస్తున్న నాటక కళాకారుడు టి ప్రభాకర్ కళ్యాణి హిరియాడ్కాలోని తన నివాసంలో కుప్పకూలి మరణించారు. బ్యాంక్ ఆఫ్ బరోడాలో రిటైర్డ్ అయిన ప్రభాకర్ కాంతారాలో న్యాయవాది పాత్రను పోషించారు. కుటుంబ సభ్యులు అందించిన వివరాల ప్రకారం.. 'ప్రభాకర్ కళ్యాణి ఇంట్లో జారిపడి చికిత్స పొందుతున్నాడు. సడెన్‌గా తన చేతులు, కాళ్లు నొప్పిగా ఉన్నాయని భార్యకు చెప్పగా ఆస్పత్రికి తరలించే ప్రయత్నం చేశారు. అయితే ఇంతలోనే ఆయన మరణించాడని' కుటుంబ సభ్యులు తెలిపారు. అతడు ఒక స్టేజ్ ఆర్టిస్ట్. కాంతార కోసం దాదాపు ఒక సంవత్సరంపాటు గడ్డం పెంచారు.

# కేరళ కుట్టీతో కిరణ్ కథాకళి




యంగ్ హీరో కిరణ్ అబ్బవరం కెరీర్ అప్ అండ్ డౌన్స్ తో సాగుతోంది. ఒక సక్సెస్ వస్తే... రెండు మూడు పరాజయాలు పలకరిస్తున్నాయి. 'రాజావారు రాణిగారు'తో తెరంగేట్రమ్ చేసిన కిరణ్ అబ్బవరంకు ఆ తర్వాత సినిమా 'ఎస్. ఆర్. కళ్యాణ మండపం' మంచి సక్సెస్ ను ఇచ్చింది. ఆ తర్వాత మళ్ళీ వరుసగా మూడు ఫ్లాప్స్ అతని ఖాతాలో పడ్డాయి. తిరిగి 'వినరో భాగ్యము విష్ణు కథ'తో సక్సెస్ ట్రాక్ లోకి వచ్చాడు. ఆ తర్వాత మరో రెండు సినిమాలు ఫ్లాప్ అయ్యాయి. గత యేడాది దీపావళి కానుకగా వచ్చిన 'క' మళ్ళీ కిరణ్ లో కొత్త ఆశలు చిగురించేలా చేసింది... బట్ ఈ యేడాది వచ్చిన 'దిల్ రుబా' తిరిగి నిరాశ పర్చింది.సినిమా థియేటర్స్ ఈ నేపథ్యంలో కిరణ్ చేస్తున్న మరో సినిమా 'కె-ర్యాంప్' . టైటిల్ బట్టి కిరణ్ అబ్బవరం ర్యాంప్ అని మన అనుకోవచ్చు... కానీ ఆగస్ట్ 9న విడుదలైన ఫస్ట్ సింగిల్ చూస్తే... ఇది కేరళ ర్యాంప్ అనిపించేలా ఉంది. కేరళలోని సంప్రదాయ నృత్యం కథాకళి నేపథ్యంలో ఈ పాటను చిత్రీకరించారు. మలయాళీ భామతో ప్రేమలో పడిన హీరో పాడే పాటగా ఇది సాగింది. 'ఇన్ స్టా ఆపేశానే, ట్విట్టర్ మానేశానే, నీకే ట్యాగ్ అయ్యానే మలయాళీ పిల్లా' అని హీరో చెప్పగానే... దానికి రియాక్షన్ గా హీరోయిన్ 'ఫోనే మార్చేశానే, ఛాటింగ్ ఆపేశానే, నీకే సింక్ అయ్యానే వదలను ఇల్లా...' అంటూ బదులివ్వడం బాగుంది. దాంతో హీరో ఇంకాస్తంత వివరంగా 'వైబే వచ్చేసిందే నిన్నే చూడగానే, లెఫ్టే ఉన్న గుండె రైటు రైటందే...' అంటూ బదులిస్తాడు. కిరణ్ అబ్బవరం సరసన ఈ సినిమాలో 'రంగబలి' ఫేమ్ యుక్తి తరేజా హీరోయిన్ గా నటిస్తోంది. వీరిద్దరి మధ్య ఈ పాటను డాన్సర్స్ తో తీశారు.





# మహేశ గురించి గూగుల్‌ని అడిగిన ప్రశ్నలివే

సూపర్‌స్టార్ మహేశ్ బాబు.. ఆ పేరే ఓ బ్రాండ్..
ఓ సినిమాలో చెప్పినట్లు ఆ పేరులోనే వైబ్ ఉంది..
కలెక్షన్లు కొల్లగొట్టడంలో 'ఆగని దూకుడు అతనిది..'
బాక్సాఫీస్‌కు బిజినెస్‌మెన్..
ప్రేక్షకుల మదిలో శ్రీమంతుడు..
మంచి మనసున్న చిన్నోడు..
ఇలా మహేశ్ గురించి చెప్పుకుంటూ పోతే చాలానే ఉన్నాయి..

వెండితెరపై సూపర్‌స్టార్‌గా ఎదిగిన మహేశ్.. నిజజీవితంలోనూ సూపర్‌స్టార్, రియల్‌స్టార్. కొన్ని వందల కుటుంబాల్లో గుండెల్లో గూడు కట్టుకున్న సైనికుడు. ఆయన చేసే ఛారిటీ గురించి అందరికీ తెలిసిందే! ఎంతో మంది చిన్నారులకు గుండె ఆపరేషన్లు చేయించి వారి పాలిట ప్రాణదాతగా నిలిచారు. ఆయన ఫౌండేషన్ నుంచి సాయం పొందాలంటే ఇలా చేయాలి..

ఈ సంస్థ ద్వారా గుండె సంబంధిత సమస్యలు ఎదుర్కొంటున్న పేద చిన్నారులకు ఉచితంగా ఆపరేషన్స్ చేయిస్తారు. ఇందుకోసం అందరికీ అందుబాటులో ఓ వెబ్ సైట్ తీసుకొచ్చారు. డైరెక్ట్‌గా సైట్‌లో అర్జీ పెట్టుకువచు. దీనిలో పూర్తి వివరాలు ఎంటర్ చేస్తే ఆయన సిబ్బంది మిమ్మల్నిసంప్రదిస్తారు. కొద్ది రోజుల క్రితమే మహేష్ బాబు ఫ్యాన్స్ తమ సోషల్ మీడియా బయోలో ఈ ఫౌండేషన్ లింక్ షేర్ చేశారు. దీన్ని చూసిన నెటిజన్లు ఆయన్ను అభినందిస్తూ పోస్టులు పెడుతున్నారు. మహేష్ తమ పాలిట దేవుడని సాయం పొందిన ఎందరో ప్రశంసిస్తున్నారు.

అలాగే తాజాగా మహేశ్ పేరు సోషల్ మీడియాలో ట్రెండింగ్‌లో ఉంది. ఆయన వ్యక్తిగత జీవితం గురించి గూగుల్‌ని ఎన్నోసార్లు రకరకాల ప్రశ్నలు వేశారు అభిమానులు. ఆ వివరాలేంటో చూద్దాం.

బాబు ఏం చదివారు?

మహేశ్ గురించి సెర్చ్ చేసిన అంశాల్లో ఆయన అకడమిక్ టాపిక్ కూడా ఉంది. ఛైల్డ్ ఆర్టిస్ట్‌గా కెరీర్ ప్రారంభించినా ఆయన చదువును అశ్రద్ధ చేయలేదు. చెన్నైలోని లయోలా కాలేజీలో కామర్స్‌లో డిగ్రీ పొందారు.

మహేష్ ఏజ్ ఎంత?

వయసు పెరుగుతున్నా మహేష్ బాబు రోజురోజుకీ చిన్నోడైపోతున్నాడు అంటూ చిరంజీవి కామెంట్ చేశారు. అయితే ఎక్కువమంది నెటిజన్లు మహేశ్ వయసు గురించి సెర్చ్ చేశారు. ఆయన అందం అటువంటిది. ఆగస్టు 9, 1975లో మహేష్ బాబు జన్మించారు.

ఇప్పుడు ఆయన వయసు 50 ఏళ్ళు.

మహేశ్ భార్య ఎవరు.. ఆమె వయసు ఎంత?

నెటిజన్లు అల్లరి చేష్టలు మామూలుగా ఉండవు. మహేష్ వయసు మాత్రమే కాదు... ఆయన భార్య ఎవరో కూడా తెలుసుకోవాలని గూగుల్ తల్లిని అడుగుతున్నారు. పైగా ఆవిడ వయసు, ఇద్దరికి మధ్య వయసు తేడా గురించి కూడా అడిగారు. మహేశ్ భార్య నమ్రత శిరోద్కర్ జనవరి 22, 1972లో జన్మించారు. మహేష్ కంటే ఆమె మూడేళ్లు పెద్ద. ఆ కారణంతో నమ్రత వయసు గురించి కూడా నెటిజన్లు సెర్చ్ చేశారు.

లవ్ స్టోరీ గురించి..


నమ్రత, మహేశ్ లవ్ స్టోరీ గురించి కూడా గూగుల్ సెర్చ్ చేశారు నెటిజన్లు. 'వంశీ' సినిమాలో వీరిద్దరూ కలిసి నటించారు. అప్పుడే ఇద్దరి మనసులు కలిశాయి. 'వంశీ' సినిమా 2000లో విడుదలైంది. ఐదేళ్ల తర్వాత 2005 ఫిబ్రవరి 10న తల్లిదండ్రుల అంగీకారంతో పెళ్లి చేసుకున్నారు. పెళ్లి తర్వాత నమ్రత సినిమాలకు దూరమయ్యారు. పిల్లల్ని, కుటుంబాన్ని చూసుకోవడంతోపాటు మహేష్ ఛారిటీ కార్యక్రమాలను ఆమె స్వయంగా చూసుకుంటారు.

ఎన్ని కార్లు ఉన్నాయ్?

అభిమానులకు తమ అభిమాన హీరో ఉపయోగించే వాచ్ నుంచి గాడ్జెట్, కారు ఇలా అన్నింటి పైనా ఆసక్తి ఉంటుంది. ఆయన గురించి గూగుల్‌లో సెర్చ్ చేసిన విషయాల్లో మహేశ్‌కు ఎన్ని కార్లు ఉన్నాయి? మహేశ్ ఎక్కువగా డ్రైవ్ చేసే కార్ ఏది అనే ప్రశ్న కూడా ఉంది. మహేష్ ఎక్కువగా రేంజ్ రోవర్ కారులో వెళతారు. దాని ఖరీదు సుమారు 2 కోట్లు. ఆయన దగ్గర మొత్తం నాలుగు లగ్జరీ కార్లు ఉన్నాయి. రేంజ్ రోవర్ సహా రూ. 1.10 కోట్లు విలువ చేసే ఆడి ఏ8, కొట్టిన్నర ఖరీదు చ్టేస టయోటా ల్యాండ్ క్రూజర్, బీఎండబ్ల్యూ ఉన్నాయని తెలిసింది. అయితే ఆయన డ్రైవింగ్ సీట్‌లో కూర్చునేది చాలా తక్కువ. మహేష్ కేర్‌వ్యాన్ ఖరీదు ఆరు కోట్ల రూపాయలు.

# విరాట్ కోహ్లీ కొత్త లుక్ చూశారా?

## రెండు నెలల విరామం తర్వాత ప్రాక్టీస్..



ఇండియన్ ప్రీమియర్ లీగ్ తర్వాత దాదాపు రెండు నెలల పాటు విశ్రాంతి తీసుకున్న టీమిండియా స్టార్ క్రికెటర్ విరాట్ కోహ్లీ మళ్లీ సాధన ప్రారంభించాడు. ఐపీఎల్ తర్వాత టెస్ట్‌లకు రిటైర్మెంట్ ప్రకటించి షాకిచ్చిన కోహ్లీ గతేడాదే టీ-20లకు కూడా వీడ్కోలు పలికాడు. కోహ్లీ ప్రస్తుతం వన్డే ఫార్మాట్‌లో మాత్రమే టీమిండియాకు ప్రాతినిధ్యం వహిస్తున్నాడు. అక్టోబర్ 19-25 మధ్య ఆస్ట్రేలియాలో టీమిండియా మూడు మ్యాచ్‌ల వన్డే సిరీస్ ఆడబోతోంది ఆ వన్డే సిరీస్‌కు ఇంకా చాలా సమయం ఉన్నప్పటికీ కోహ్లీ ఇప్పటికే ప్రాక్టీస్ ప్రారంభించాడు. ప్రస్తుతం కుటుంబంతో కలిసి లండన్‌లోనే నివసిస్తున్న కోహ్లీ అక్కడే ప్రాక్టీస్ చేస్తున్నాడు. ఐపీఎల్‌లో గుజరాత్ టైటాన్స్ సహాయక కోచ్ నయీమ్ అమిన్ పర్యవేక్షణలో కోహ్లీ బ్యాటింగ్ ప్రాక్టీస్ ప్రారంభించాడు. సాధన అనంతరం అమిన్‌తో కలిసి దిగిన ఫొటోను కోహ్లీ ఇన్‌స్టాగ్రామ్‌లో షేర్ చేశాడు. తనకు సహాయం చేసినందుకు అమిన్‌కు కోహ్లీ ధన్యవాదాలు తెలియజేశాడు.

# నన్నూ వదిలేయండి



చెన్నై: సంజూ శాంసన్ మాదిరే ఆర్.అశ్విన్ కూడా తన సొంత జట్టును వీడాలని భావిస్తున్నాడు. ఈమేరకు చెన్నై సూపర్ కింగ్స్ (సీఎస్కే)కు విజ్ఞప్తి చేసినట్టు సమాచారం. అయితే ఇరు వర్గాల నుంచి ఈ విషయమై అధికారిక ప్రకటన వెలువడలేదు. పదేళ్ల తర్వాత ఆఫ్ స్పిన్నర్ అశ్విన్ గత సీజన్‌లోనే మళ్లీ చెన్నైకి ఆడాడు. 9 మ్యాచ్‌ల్లో ఏడు వికెట్లు తీసిన ఈ వెటరన్‌ను మెగా వేలంలో రూ.9.75 కోట్లకు దక్కించుకుంది. అయితే 2022-2024 మధ్య రాజస్థాన్‌కు ఆడిన అశ్విన్ తిరిగి అదే జట్టులో చేరేందుకు ఆసక్తి చూపుతున్నట్టు కథనాలు వినిపిస్తున్నాయి.

ఇద్దరిని ఇస్తేనే..: రాజస్థాన్ కెప్టెన్ శాంసన్‌ను తీసుకోవాలనుకుంటున్న సీఎస్కేకు ఆ ఫ్రాంచైజీ ఓ షరతు విధించినట్టు తెలుస్తోంది. వాస్తవానికి శాంసన్‌ను అతడి ధర రూ.18 కోట్లు ఇచ్చి చెన్నై తీసుకోవాలనుకుంది. అయితే రాజస్థాన్ మాత్రం నగదు కాకుండా శాంసన్‌కు బదులు ఇద్దరు సీఎస్కే ఆటగాళ్లను ఇవ్వాలని డిమాండ్ చేస్తోందట. దీంతో ప్రస్తుతానికి ఈ విషయమై ప్రతిష్ఠంభన నెలకొంది. ఒకవేళ ఈ చర్చలకు పరిష్కారం లభించకపోతే శాంసన్ వేలానికి వెళ్లక తప్పదు.

# ఎన్నాళ్లకెన్నాళ్లకు



లండన్: భారత జట్టు తదుపరి వన్డే సిరీస్ మరో రెండు నెలలకుపైగానే ఉంది. వచ్చే అక్టోబరులో ఆస్ట్రేలియాలో పర్యటించనున్న టీమిండియా పరిమిత ఓవర్ల సిరీసలో తలపడనుంది. అందులో భాగంగా 3 వన్డేలు, 5 టీ20లలో భారత్-ఆస్ట్రేలియా ఢీకొననున్నాయి. అక్టోబరు 19న వన్డే సిరీస్ మొదలు కానుంది. వాస్తవంగా ఈ ఆగస్టులో బంగ్లాదేశ్ పర్యటనలో భారత్ వన్డే, టీ20 సిరీస్ ఆడాల్సి ఉంది. కానీ ఆ సిరీస్ రద్దయింది. ఇక..భారత జట్టు స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ ఆస్ట్రేలియాతో వన్డే సిరీసకు సన్నాహకాలు మొదలు పెట్టాడు. విరాట్ చివరిసారి మైదానంలో కనిపించి రెండు నెలలపైనే అయ్యింది. ఇక..ఇటీవల టెస్ట్‌లు, అంతకుముందు టీ20లనుంచి రిటైర్ అయిన కోహ్లీ..ఐపీఎల్ అనంతరం లండన్ వెళ్లిపోయి అక్కడే ఉంటున్నాడు. మొత్తంగా మెగా లీగ్ అనంతరం పూర్తిగా విశ్రాంతి తీసుకుంటున్న అతడు..వన్డేలలో సత్తా చాటేందుకు సన్నద్ధమవుతున్నాడు. గుజరాత్ సహాయ కోచ్ నయీమ్ అమీన్‌తో కలిసి లండన్‌లోని ఓ ఇండోర్ స్టేడియంలో కోహ్లీ ప్రాక్టీస్ షురూ చేశాడు. ఈమేరకు ఆ ఫొటోను అతడు ఇన్‌స్టాలో పోస్ట్ చేశాడు.

# భారత షట్లర్లకు సులువైన డ్రా




న్యూఢిల్లీ: భారత బ్యాడ్మింటన్ జట్టుకు ప్రపంచ జూనియర్ టీమ్ చాంపియన్‌షిప్‌లో సులువైన డ్రా ఎదురైంది. హాంకాంగ్, నేపాల్, ఘనాలాంటి పసికూన జట్లతో కలిపి భారత్‌కు గ్రూప్-హెచ్‌లో చోటు దక్కింది. భారత్ ఆతిథ్యమిస్తున్న ఈ మెగా టోర్నీ వచ్చే అక్టోబరు 6 నుంచి 11 వరకు అసోం రాజధాని గువాహటిలో జరగనుంది. మొత్తం 37 జట్లు 8 గ్రూపులుగా విడిపోయి తలపడనున్నాయి. ప్రతి గ్రూప్‌లో విజేతగా నిలిచిన జట్టు క్వార్టర్‌ఫైనల్‌కు అర్హత సాధిస్తుంది. టోర్నీ టాప్‌సీడ్ థాయ్‌లాండ్ గ్రూప్-ఎలో డెన్మార్క్, స్లోవేనియా, కుక్ ఐలాండ్ జట్లతో కలిసి తలపడనుంది. ప్రతి జట్టు పురుషులు, మహిళల సింగిల్స్, పురుషులు, మహిళల డబుల్స్, మిక్స్‌డ్ డబుల్స్ మ్యాచ్‌లు ఆడాల్సి ఉంటుంది.

# ఆకాశ్ దీప్‌దే బాల్ ఆఫ్ ద సిరీస్



న్యూఢిల్లీ: ఇంగ్లండ్‌తో జరిగిన ఐదు టెస్టుల సిరీస్‌లో సిరాజ్ ప్రదర్శనను సచిన్ ఎంతగానో కొనియాడాడు. అతడికి రావాల్సినంత గుర్తింపు రాలేదని అభిప్రాయపడ్డాడు. అయితే ఈ సిరీస్‌లో అత్యుత్తమ బంతిని విసిరింది మాత్రం ఆకాశ్‌దీప అని చెప్పాడు. రెండో టెస్టు నాలుగో రోజున అద్భుత ఇన్‌స్వింగర్‌తో జోరూట్‌ను ఆకాశ్ బౌల్డ్ చేశాడు. ఆ బంతినే సచిన్ 'బాల్ ఆఫ్ ద సిరీస్'గా ప్రకటించడం విశేషం. ఆ టెస్టులో భారత్ గెలిచిన సంగతి తెలిసిందే. కాగా ఐదో టెస్టు మూడో రోజు చివర్లో ఓపెనర్ క్రాలేను స్లో యార్కర్‌తో సిరాజ్ క్లీన్‌బౌల్డ్ చేసిన బంతి అద్భుతమంటూ సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది.

# ఆటగాడిగా గెలిచి.. జీవితంలో ఓడి..






ఖోఖో క్రీడనే ప్రాణంగా భావించి.. అంతర్జాతీయ స్థాయిలో అద్భుతమైన ప్రదర్శనతో రాష్ట్రానికి, దేశానికి ఎన్నో పతకాలు అందించాడు. కానీ, వ్యక్తిగత జీవితంలో మాత్రం పేదరికం, కష్టాలతో సహవాసం చేశాడు. బతికినంతకాలం ఆర్థిక ఇబ్బందులతోనే సతమతమై, చివరకు అనారోగ్యంతో ప్రాణాలు విడిచాడు. అతనే తెలంగాణకు చెందిన ఖోఖో మాజీ ఆటగాడు, 50 ఏళ్ల సారంగపాణి. అంతర్జాతీయ పోటీల్లో 21 సార్లు భారత్‌కు ప్రాతినిధ్యం వహించిన సారంగపాణి.. శుక్రవారం ఉదయం తన స్వస్థలమైన వరంగల్‌లో అనారోగ్యంతో తుది శ్వాస విడిచాడు.

ఆటలో అదరగొట్టినా..

తొంభయ్యో దశకంలో భారత ఖోఖోలో తిరుగులేని డిఫెండర్‌గా పేరు తెచ్చుకున్న సారంగపాణి.. కోల్‌కతా వేదికగా 1996లో జరిగిన ఆసియా చాంపియన్‌షిప్‌లో టీమిండియా స్వర్ణ పతకం గెలవడంలో ముఖ్య భూమిక పోషించాడు. 1999లో మణిపూర్‌లో జరిగిన జాతీయ క్రీడల్లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు తన సారథ్యంలో కాంస్య పతకం అందించాడు. జాతీయ, రాష్ట్రస్థాయిలో సుమారు 30కిపైగానే పతకాలు కొల్లగొట్టాడు. అమోఘమైన ప్రదర్శనతో తన క్రీడలో వెలుగొందిన అతను.. ప్రభుత్వాల నుంచి సరైన ప్రోత్సాహం లేక జీవితంలో మాత్రం ఓడిపోయాడు.

సరైన గుర్తింపు, ఉపాధి లేక..

క్రీడాకారుడిగా కెరీర్ ముగిశాక సారంగపాణి కొన్నాళ్లు వరంగల్ జిల్లా స్పోర్ట్స్ అథారిటీలో కాంట్రాక్టు కోచ్‌గా పని చేశాడు. ఆ తర్వాత నిధుల కొరతతో అతడిని ఉద్యోగం నుంచి తొలగించారు. దీంతో నాయీ బ్రాహ్మణుడైన అతను కుల వృత్తి చేసుకుంటూ జీవనం వెళ్లదీశాడు. అంతర్జాతీయ స్థాయి క్రీడాకారుడినైన తనకు కనీసం చిన్న ఉద్యోగం కానీ, నగదు ప్రోత్సాహకం కానీ లభించకపోవడంపై సారంగపాణి తరచూ మధనపడేవాడని అతని సన్నిహితులు తెలిపారు. కోచ్‌గా కాకపోయినా, స్వీపర్ ఉద్యోగమైనా ఇవ్వాలని నెలరోజుల క్రితమే అతను కలెక్టర్ కార్యాలయం చుట్టూ తిరిగాడని, అయినా ఎవరూ పట్టించుకోలేదని వారు వెల్లడించారు. ఇక, జీవితంలో స్థిరపడలేదన్న కారణంతో అతను పెళ్లి కూడా చేసుకోలేదన్నారు.ప్రభుత్వాలు అండగా నిలవాలి క్రికెట్, బ్యాడ్మింటన్, టెన్నిస్, ఫుట్‌బాల్ వంటి కొన్ని క్రీడలకే ప్రాముఖ్యం ఇవ్వడం వల్ల సారంగపాణిలాంటి ప్రతిభావంతులైన అంతర్జాతీయ క్రీడాకారులు ప్రపంచానికి తెలియకుండానే కనుమరు గవుతున్నారు. ఖోఖో, కబడ్డీ, వాలీబాల్ వంటి గ్రామీణ క్రీడలతో పాటు స్విమ్మింగ్, హ్యాండ్‌బాల్ వంటి ఒలింపిక్ క్రీడల అభివృద్ధి, ఆ క్రీడాకారుల సంక్షేమంపై కూడా ప్రభుత్వాలు, కార్పొరేట్ సంస్థలు దృష్టి పెట్టాలని క్రీడా విశ్లేషకులు కోరుతున్నారు. ఆటకు వీడ్కోలు పలికిన తర్వాత వాళ్లకు ఏదో ఒక విధంగా ఉపాధి కల్పించాలని సూచిస్తున్నారు.

# టుడే బిజినెస్

# మళ్లీ పెరిగిన బంగారం ధర.. ఈ రోజు బంగారం, వెండి ధరలు ఎలా ఉన్నాయంటే..



అంతర్జాతీయంగా నెలకొన్ని అనిశ్చితుల కారణంగా పెట్టుబడిదారులు సురక్షిత ఆస్తుల వైపు మొగ్గ చూపుతుండడం బంగారం ధరల పెరుగుదలకు కారణంగా కనిపిస్తోంది. ఈ నేపథ్యంలో ఈ రోజు (ఆగస్టు 9న) ఉదయం 6.30 గంటల సమయానికి పలు నగరాల్లో బంగారం ధర ఎలా ఉందో తెలుసుకుందాం..బంగారం ధర మళ్లీ ఆల్‌టైమ్ గరిష్టానికి చేరువ అవుతోంది. భౌగోళిక రాజకీయ అనిశ్చితుల నేపథ్యంలో పెట్టుబడిదారులు సురక్షిత ఆస్తుల వైపు మొగ్గ చూపుతుండడం బంగారం ధరల పెరుగుదలకు కారణంగా కనిపిస్తోంది. ఈ నేపథ్యంలో ఈ రోజు (ఆగస్టు 9న) ఉదయం 6.30 గంటల సమయానికి 10 గ్రాముల 24 క్యారెట్ల బంగారం ధర రూ. రూ. 1, 03, 320కి చేరింది. 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ. రూ. 94, 710కి చేరింది. నిన్నటితో పోల్చుకుంటే బంగారం ధర స్వల్పంగా పెరిగింది.ఢిల్లీలో 24 క్యారెట్ల పసిడి రేటు 10 గ్రాములకు రూ. 1, 03, 470కి చేరుకోగా, 22 క్యారెట్ల గోల్డ్ ధర 10 గ్రాములకు రూ. 94, 860కి చేరుకుంది. ఇక హైదరాబాద్, విజయవాడలో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ. 1, 03, 320కి చేరుకోగా, 22 క్యారెట్ల 10 గ్రాముల గోల్డ్ రేటు రూ. 94, 710కి చేరింది. వెండి ధరలు నిన్నటితో పోల్చుకుంటే కేజీకి వంద రూపాయల మేర తగ్గాయి. ఈ క్రమంలో దేశంలోని ప్రధాన నగరాల్లో ఉన్న బంగారం, వెండి రేట్లను ఇప్పుడు తెలుసుకుందాం.

# ఇన్‌కమ్ ట్యాక్స్ బిల్లును వెనక్కి తీసుకున్న కేంద్రం.. సోమవారం మరో కొత్త బిల్లు..




ఈ ఏడాది ఫిబ్రవరిలో పార్లమెంట్‌లో కేంద్రం ప్రవేశపెట్టిన ఇన్‌కమ్ ట్యాక్స్ బిల్లును కేంద్ర ప్రభుత్వం తాజాగా ఉపసంహరించుకుంది. మార్పు చేర్పులతో కూడిన కొత్త బిల్లును ఆగస్టు 11న మళ్లీ పార్లమెంట్‌లో ప్రవేశపెట్టబోతోంది. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వం ప్రకటన విడుదల చేసింది. 1961లో రూపొందించిన ఆదాయపు పన్ను చట్టానికి కేంద్ర ప్రభుత్వం అనేక సవరణలు చూసి కొత్త బిల్లును ఈ ఏడాది ఫిబ్రవరి 13న పార్లమెంట్‌లో ప్రవేశపెట్టింది. ఈ కొత్త ఇన్‌కమ్ ట్యాక్స్ బిల్లు-2025కు బైజయంత్ పాండా నేతృత్వంలోని సెలెక్ట్ కమిటీ పలు సవరణలు సూచించింది. ఆ సవరణలు చేసి రూపొందించిన కొత్త ఇన్‌కమ్ ట్యాక్స్ బిల్లు-2025ను కేంద్రం సోమవారం పార్లమెంట్‌లో ప్రవేశపెట్టబోతోంది. కమిటీ సూచించిన అన్ని మార్పులతో స్పష్టమైన, సరళమైన భాషతో కూడిన నవీకరించిన ఆదాయపు పన్ను బిల్లును సభ పరిశీలన కోసం ఆగస్టు 11న ప్రవేశపెట్టబోతున్నారు. ఈ కొత్త బిల్లు పలు గందగోళాలకు తెర దించడమే కాకుండా కొన్ని సవరణలకు కూడా చోటు కల్పించబోతోందట.


ఇంటిపై ఆదాయం పొందుతున్న వారికి ఉపశమనం కలిగేలా ఈ కొత్త బిల్లులో పలు మార్పులు చేసినట్టు సమాచారం. గృహరుణ వడ్డీతో పన్ను మినహాయింపు ప్రస్తుతం సొంతింట్లో ఉన్న వారికి మాత్రమే వర్తిస్తోంది. ఈ కొత్త బిల్లు ప్రకారం సొంతింటిని అద్దెకు ఇచ్చిన వారికి కూడా వడ్డీతో పన్ను మినహాయింపు లభించనుందట. అలాగే టీడీఎస్, టీసీఎస్ రిఫండ్లను కూడా ఈ కొత్త బిల్లు ద్వారా సరళతరం చేయబోతున్నట్టు తెలుస్తోంది.

# ఎస్‌బీఐ భళా



న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగ బ్యాం కింగ్ దిగ్గజం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) ఆర్థిక ఫలితాలు మార్కెట్ అంచనాలను మించాయి. వర్తమాన ఆర్థిక సంవత్సరంలో జూన్ త్రైమాసికానికి ఎస్‌బీఐ ఏకీకృత నికర లాభం వార్షిక ప్రాతిపదికన 10 శాతం పెరుగుదలతో రూ.21,201 కోట్లకు చేరిం ది. ట్రెజరీ, ఫారెక్స్ కార్యకలాపాల్లో ఆకర్షణీయ లాభాలు ఇందుకు ప్రధానంగా దోహదపడ్డాయి. ఈ క్యూ1లో బ్యాంక్ స్టాండ్ అలోన్ నికర లాభం 12 శాతం పెరిగి రూ.19,160 కోట్లుగా నమోదైంది. గత ఆర్థిక సంవత్సరంలో ఇదే కాలానికి స్టాండ్ అలోన్ లాభం రూ.17,035 కోట్లుగా ఉంది. జూన్ త్రైమాసికంలో బ్యాంక్ మొత్తం ఆదాయం గత ఏడాదితో పోల్చితే రూ.1,22,688 కోట్ల నుంచి రూ.1,35,342 కోట్లకు పెరిగింది. మరిన్ని విషయాలు..ఈ క్యూ1లో మొత్తం రుణాలు 11.6 శాతం వృద్ధి చెందినప్పటికీ బ్యాంక్ నికర వడ్డీ ఆదాయం (ఎన్‌ఐఐ) మాత్రం 0.13% తగ్గి రూ.41,072 కోట్లకు పరిమితమైంది. నికర వడ్డీ మార్జిన్ (ఎన్‌ఐఎం) కూడా 0.33న్ల క్షీణించి 3.02 శాతానికి జారుకుంది. ఆర్‌బీఐ రెపోరేటు తగ్గించడంతో పాటు డిపాజిట్ల రేట్లను దిగువకు సవరించేందుకు సమయం పట్టడం వడ్డీ మార్జిన్లపై ప్రభావం చూపింది. రెండో త్రైమాసికంలోనూ నికర వడ్డీ మార్జిన్‌పై ఒత్తిడి కొనసాగనుందని, ఆ తర్వా త మళ్లీ మెరుగుపడవచ్చని ఎస్‌బీఐ చైర్మన్ చల్లా శ్రీనివాసులు శెట్టి అన్నారు. ఈ ఆర్థిక సంవత్సరానికి 3 శాతం ఎన్‌ఐఎంను లక్ష్యంగా పెట్టుకున్నామని ఆయన చెప్పారు.క్యూ1లో వడ్డీయేతర ఆదాయం ఏకంగా 55% ఎగబాకి రూ.17,346 కోట్లకు చేరుకుంది. అందులో ఫారెక్స్ కార్యకలాపాల ద్వారా ఆదాయం 352% పెరిగి రూ.1,632 కోట్లకు చేరగా.. పెట్టుబడుల విక్రయంపై లాభం 1445 వృద్ధితో రూ.6,326 కోట్లకు పెరిగింది.నిర్వహణ వ్యయాలు 7.88% పెరిగి రూ.27,874 కోట్లకు చేరినప్పటికీ, వ్యయ వృద్ధిని కట్టడం చేయడం లాభదాయకత మెరుగుపడేందుకు దోహదపడింది.

# తాజ్ జీవీకే లాభం రూ.36 కోట్లు



హైదరాబాద్(ఆంధ్రజ్యోతి బిజినెస్): జూన్ త్రైమాసికంలో తాజ్ జీవీకే హోటల్స్ అండ్ రిసార్ట్స్ లిమిటెడ్ నికర లాభం దాదాపు మూడింతలై రూ.36.22 కోట్లకు పెరిగింది. గత ఆర్థిక సంవత్సరంలో ఇదే కాలానికి కంపెనీ లాభం రూ.12.71 కోట్లుగా ఉంది. కాగా, ఆదాయం రూ.94.70 కోట్ల నుంచి రూ.128.29 కోట్లకు ఎగబాకింది. తమ సంస్థకిది అత్యుత్తమ తొలి త్రైమాసికమని తాజ్ జీవీకే చైర్మన్ జీవీకే రెడ్డి అన్నారు.

# స్టాక్ మార్కెట్ బేర్



ముంబై: దేశీయ స్టాక్ మార్కెట్‌లో ట్రంప్ సుంకాల పోటు కొనసాగుతోంది. ఈ దెబ్బతో సెన్సెక్స్ 765.47 పాయింట్ల నష్టంతో 79,857.79 వద్ద ముగియగా నిఫ్టీ 232.85 పాయింట్ల నష్టంతో 24,363.39 వద్ద క్లోజయింది. బీఎస్ఈలో లిస్టయిన కంపెనీల షేర్ల మార్కెట్ విలువ దాదాపు రూ.5 లక్షల కోట్లు పడిపోయి రూ.440.63 లక్షల కోట్లకు చేరింది. సెన్సెక్స్, నిఫ్టీ గత మూడు నెలల్లో ఇంత కనిష్ఠ స్థాయిలో ముగియడం ఇదే మొదటిసారి. గత ఆరు వారాల నుంచీ ఈ రెండు కీలక సూచీలు నష్టాల్లో నడుస్తున్నాయి. కొవిడ్ తర్వాత సూచీలు వరుసగా ఇన్ని వారాలు నష్టాలతో ముగియడం ఇదే మొదటిసారి. ట్రంప్ సుంకాల పోటు కారణంగా ఎఫ్‌పీఐలు శుక్రవారం సైతం పెద్ద ఎత్తున అమ్మకాలకు దిగాయి. దీంతో రియల్టీ, మెటల్, టెలికం, కన్జుమర్ డ్యూరబుల్, క్యాపిటల్ గూడ్స్, కమోడిటీ కంపెనీల షేర్లు తీవ్ర అమ్మకాల ఒత్తిడికి లోనవుతున్నాయి. అయితే నిఫ్టీకి 24,200-24150 మధ్య గట్టి మద్దతు కనిపిస్తోంది. ఆ స్థాయిని కూడా బ్రేక్ చేస్తే నిఫ్టీ 23,750 పాయింట్లకు కూడా పడిపోయే ప్రమాదం ఉందని టెక్నికల్ అనలిస్టుల అంచనా.

# తెలుగు రాష్ట్రాల్లో రూ.7,657 కోట్ల రుణాలు

Piramal Finance

హైదరాబాద్ : పిరామల్ ఫైనాన్స్ తెలుగు రాష్ట్రాల్లో తన వ్యాపారాన్ని విస్తరిస్తోంది. ప్రస్తుతం రెండు రాష్ట్రాల్లో 55 శాఖల ద్వారా వివిధ వర్గాలకు రూ.7,657 కోట్ల మేరకు రుణాలు మంజూరు చేసినట్టు కంపెనీ మార్కెటింగ్ హెడ్ అరవింద అయ్యర్ తెలిపారు. ఇందులో తెలంగాణ వాటానే రూ.5,000 కోట్ల నుంచి రూ.5,200 కోట్ల వరకు ఉందన్నారు. ఇది తమ మొత్తం రుణ పోర్టుఫోలియోలో పదిశాతమని తెలిపారు. ఎంఎసఎంఈలతో పాటు వ్యక్తిగత, గృహ రుణాలు, ఆస్తులు, మ్యూచువల్ ఫండ్స్ యూనిట్ల హామీపై తమ కంపెనీ రిటైల్ రుణాలు ఇస్తుందన్నారు. ఆదాయానికి సంబంధించి సరైన ధ్రువ పత్రాలు లేని వ్యక్తులకూ, కొన్ని షరతులకు లోబడి తాము రుణాలిస్తామని అయ్యర్ చెప్పారు. తామిచ్చే గృహ రుణాలపై వడ్డీ 9.9 శాతం నుంచి 14 శాతం వరకు ఉంటుందన్నారు.

TGTEL/25/A0348 TITLE: Sandhesham Times 3-82,Ananthagiri, Singavaram, SURYAPET, Telangana,508 206 Gmail : sandeshamtimes@gmail.com Website:https://sandeshamtimes.com Publisher Press (Name & Address) SUNDAY PRINTING PRESS 3-4297,SARASWATHI COMPLEX, SVN COLONY, GUNTUR, ANDHRA PRADHESH-522 006